ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
బుధవారం 27 నవంబరు 2024


5

● అధికారుల కళ్లకు మామూళ్ల గంతలు
● ఒక్కో పట్టణానికి ఒక్కో రేటు
● ఉమ్మడి గుంటూరుకీ ఒక రేటు

రహదారి భద్రత రవాణా శాఖ గాలికొదిలేసింది. ఓవర్ లోడ్‌లో టిప్పర్లు రోడ్లపై దూసుకుపోతున్నా చర్యలు తీసుకోవాల్సిన రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోకుండా మామూళ్ల వసూళ్ళకు పాల్పడుతున్నారు. పనిలో పనిగా ఇటీవల మామూళ్ళ రేటు కూడా పెంచారని వాహనదారులు చెబుతున్నారు.

మామూళ్లు.. ఓవర్ లోడ్

పరిమితికి మించి లోడుతో దూసుకుపోతున్న టిప్పర్లు




ఓవర్ లోడ్‌తో టిప్పర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి గుంటూరు జిల్లాలో రవాణా శాఖలోని కొందరు అధికారులు టిప్పర్ లారీ యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో క్వారీలు, స్టోన్ క్రషర్‌లు, ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్నాయి. సహజంగా లారీ లోడ్‌ని బట్టి కాకుండా సరుకు బరువుని బట్టి కిరాయి, ధర ఉంటుంది. దీంతో లారీ యజమానులు ఎక్కువ మొత్తంలో సరుకు రవాణాకు మొగ్గు చూపుతున్నారు. ఇది రవాణా శాఖ ఉద్యోగులు కొందరికి వరంగా మారింది. ఓవర్ లోడ్ వాహనాలకు పట్టణానికి ఒక ధర చొప్పున నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే రాజకీయ నాయకులు పేరు చెప్పి మరీ వసూళ్లకు దిగడం గమనార్హం.
ఓవర్ లోడు వాహనాలు గుంటూరు నగరంలోకి వెళ్లాలంటే నెలకు రూ. 17,500, తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేటలలో రూ. 6,000, పిడుగురాళ్ల, నరసరావుపేట రూ. 12,000, బాపట్ల రూ. 9,000 చొప్పున చెల్లించాల్సి వస్తోందని యాజమానులు వాపోతున్నారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా మొత్తం తిప్పాలంటే, నెలకు ఒక్కో టిప్పర్‌కు 68,000 పైగా చెల్లిస్తున్నట్టు లారీ యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 500 వరకు టిప్పర్లున్నాయని, వాటిలో 70శాతానికి పైగా

(మిగతా 8వ పేజీలో)




అద్దంకి మండలం బొమ్మనంపాడులో పురాతన భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల

పశువైద్యం.. దైన్యం!

- కొన్నేళ్లుగా భర్తీకి నోచుకోని పశువైద్యుల పోస్టులు
- అరకొర సిబ్బందితోనే వైద్య సేవలు
- ఆరు నెలల నుంచి మందుల పంపిణీ ఊసేలేదు
- గత ప్రభుత్వంలో పథకాలన్నింటికి మంగళం
- శిథిలభవనాల్లో ఆసుపత్రులు...మేత అందించే విషయంలోనూ నిర్లక్ష్యమే
- పోషణ బరువై సంతలో అమ్మేసుకుంటున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
మూగజీవాల వైద్యం పట్ల కూడా ప్రభుత్వాలు శీతకన్నే వేస్తున్నాయి. గత ప్రభుత్వం పశువులకు వైద్యం అందించే విషయంలో కూడా కనికరం లేకుండా వ్యవహరించడంతో పాడి రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. పేరుకే పశువైద్యశాలలు తప్ప సరిపడా సిబ్బంది మచ్చుకైనా కనిపించని దుస్థితి. మూడు నెలల కొకసారి పంపిణీ చేయాల్సిన ముందుల విషయంలో గత ప్రభుత్వం ఎడతెగని జాప్యం ప్రదర్శించి ఎన్నో మూగజీవాల మృత్యువాతకు పరోక్షంగా నాటిపాలకులు కారణమయ్యారు. కూటమి ప్రభుత్వంలోనూ అదే తంతు కొనసాగుతోంది. గడచిన ఆరు నెలలుగా పశువైద్యశాలకు మందుల పంపిణీ జరగలేదంటే నిర్లక్ష్యం ఏ రీతిన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే మందుల పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పశువుల విషయంలో అమలులో ఉన్న అనేక పథకాలకు గత ప్రభుత్వం తూట్లు పొడవడంతో వాటి పోషణే రైతులకు తలకు మించిన భారంగా మారడంతో చాలా వరకు సంతలో అమ్మేసుకోవాల్సిన దయనీయ పరిస్థితిని పాడి రైతులు ఎదుర్కొన్నారు. ఇక వైద్య శాల భవనాలు అయితే చాలా వరకు శిథిలావస్థలోనే దర్శనమిస్తున్నాయి. ఈ బాలారిష్టాలపై దృష్టి పెట్టాల్సిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పశువుల ఆసుపత్రుల సమస్యలపై దృష్టి పెట్టకపోగా మూడు నెలలకొకసారి పంపిణీ చేయాల్సిన మందుల విషయంలోనూ శీతకన్నే వేసింది. ఇప్పటికైనా పశువైద్యంతో పాటు రాయితీ పథకాలన్నీ పునరుద్ధరించే దిశగా కూటమి పాలకులు చర్యలు తీసుకుంటేనే జిల్లాలో పాడి రైతు మనుగడ సాగించే పరిస్థితి ఉంటుందని లేకపోతే వ్యవసాయ అనుబంధంగా కొనసాగుతున్న పాడి పరిశ్రమ త్వరలోనే కనుమరుగు కావడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

బాపట్ల జిల్లాలో మొత్తం 542 పశు వైద్యశాలలు...

జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 542 వైద్యశాలలు పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. వీటిలో చీరాల డివిజన్ కింద 273 ఉండగా, బాపట్ల డివిజన్ కింద 269 ఉన్నాయి. ఏరియా వెటర్నరీ ఆసుపత్రుల విషయానికొస్తే మొత్తం పది ఉండగా చీరాల డివిజన్ కింద 6, బాపట్ల కింద 4 ఉన్నాయి. వెటర్నరీ డిస్పెన్సరీలకు వచ్చేసరికి మొత్తం 65, రూరల్ లైవ్ స్టాక్ యూనిట్స్ 59, 408 రైతు సేవా కేంద్రాలలో వైద్య సేవలు అందుతున్నాయి. పేరుకే పెద్ద సంఖ్యలో వైద్యశాలలు తప్ప వీటిలో కనీస సౌకర్యాలు లేనివి సగానికి పైగానే ఉండడం గమనార్హం. దాదాపు వంద వరకు ప్రైవేటు భవనాల్లోనే కొనసాగుతుండగా, మరో 90వరకు శిథిల భవనాల్లోనే మూగ జీవాలకు వైద్యం అందించడం వాటి దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది

అరకొర సిబ్బందే....

జిల్లా వ్యాప్తంగా మొత్తం 47 పోస్టులు భర్తీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 7, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు 30, ఏహెచ్ఏలు 4, జూనియర్ అసిస్టెంట్, లైవ్ స్టాక్ ఆఫీసర్, అసిస్టెంట్, ఎన్యుమరేటర్ పోస్టులు ఒక్కొక్కటీ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు రెండు చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటి భర్తీ విషయంలో గత పాలకులు కనీస శ్రద్ధ కూడా చూపలేదు. దీంతో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందడం గగనమై పోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వీటి భర్తీ విషయంలో కదలిక వచ్చినట్లు తెలుస్తోంది

జిల్లా వ్యాప్తంగా మూగ జీవాల లెక్క ఇది...

జిల్లా వ్యాప్తంగా గేదెల సంఖ్య 3,81,764 కాగా, ఆవుల సంఖ్య 21,930గా ఉంది. గొర్రెలు 4,27,523 కాగా, మేకలు 49,990గా ఉన్నాయి. పందుల సంఖ్య 3,219 కాగా కోళ్ల సంఖ్య 7,76, 022గా ఉంది. వీటన్నింటికి సరిపడా వైద్యం అందించాలంటే ఒక్కొక్క మూగజీవంపై రమారమి 8 రూపాయల వరకు ప్రభుత్వాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ అరకొర నిధులతో ఒక్కో జీవంపై సగటున రూపాయి మాత్రమే ప్రభుత్వాలు వెచ్చిస్తుండడం పశువైద్యం దైన్యానికి నిదర్శనంగా కనబడుతోంది

మందులకు ఇండెంట్ పెట్టాం

మందుల విషయంలో ఇప్పటికే ఇండెంట్ పెట్టాం. త్వరలోనే జిల్లాలోని అన్ని పశువుల ఆసుపత్రులకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఖాళీల భర్తీ విషయంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. దాణా సమృద్ధిగా అందుబాటులో ఉంది. పశువులకు వైద్యం అందించే విషయంలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా చూస్తున్నాం. అదే విధంగా ఉపాధి హామీ పనుల కింద పశువుల షెడ్డుల నిర్మాణానికి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. దీనితో పాటు పశుగ్రాసం కోసం మండలాలు యూనిట్‌గా క్షేత్రాలను ఎంపిక చేస్తున్నాం

-బి. వేణుగోపాల్,
డీఏహెచ్‌వో


బాపట్ల ఏరియా పశు వైద్యశాలలో గేదెకు వైద్యం చేస్తున్న డాక్టర్

మూడు నెలల కొకసారి....

పశువుల ఆసుపత్రులకు మందుల పంపిణీ విషయంలో ప్రతి క్వార్టర్ ప్రామాణికంగా పంపిణీ జరుగుతూ ఉంటుంది. కానీ గత ప్రభుత్వం ఈ రివాజుకు తిలోదకాలిచ్చి నెలల తరబడి మందుల పంపిణీ జరపకపోవడంతో పాడి రైతులు అధిక ధర వెచ్చింది మందులను బయటే కొనాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో మందుల పంపిణీ విషయంలో అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడం గమనార్హం. గడచిన ఆరు నెలలుగా పశువుల మందుల పంపిణీనే జరగలేదు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే అన్ని వైద్యశాలలకు మందులను సమృద్ధిగా పంపిణీ చేయడం జరుగుతుందని యంత్రాంగం చెబుతోంది

రాయితీ పథకాలన్నింటికీ మంగళం...

ప్రస్తుతం పాడి పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడడం వెనక గత ప్రభుత్వం అవలంభించిన విధానాలు కూడా కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా పశుబీమా విషయంలో ఏళ్ల తరబడి జాప్యం చేసి పాడి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 2014-19 మధ్య నిర్మాణం చేపట్టిన గోకులాలకు బిల్లులు చెల్లించకపోగా ఆ పథకాన్నీ అటకెక్కించింది. ఇక దాణా విషయంలో అందించే రాయితీలపై గత ప్రభుత్వం శీతకన్ను వేయడంతో పోషణ భారంగా మారి పశువులను అయినకాడికి అమ్ముకునే దురవస్థను పాడి రైతులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా టీఎంఆర్ మాత్రమే అందుబాటులో ఉంది తప్పితే రైతులు మొగ్గుచూపే శైలేజీ దాణా పంపిణీ జరగడం లేదు. ఇప్పటికే గోకులం షెడ్డుల పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. పశువుల దాణా విషయంలో గతంలో ఇచ్చిన రాయితీలన్నీ అమల్లోకి తేవడంతో పాటు ధర తక్కువగా ఉండే శైలేజి రకాన్ని అందుబాటులో ఉంచాలని పాడి రైతులు కోరుతున్నారు.

అక్రమ వసూళ్లను అడ్డుకోరా?

- ప్రశ్నిస్తున్న ట్రాక్టర్ల యజమానులు
- ఇసుక తవ్వకాలు, గాలు మెయింటెనెన్స్ కోసం అక్రమాలు
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు
- కొల్లూరులో ఆందోళనకు దిగుతాం


కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇసుక తవ్వకాలు, గాలు మెయింటెనెన్స్ కోసం జరుగుతున్న అక్రమాలు అడ్డుకోరా అంటూ ట్రాకర్ల యజమానులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇసుక రీచ్ వద్ద నిత్యం 800 నుంచి వెయ్యి ట్రాక్టర్ల వరకు ఇసుక లోడింగ్ అవుతున్నాయి. ఇసుక లోడింగ్‌కు రూ.600 కూలీ, గాలు మెయింటెనెన్స్ కింద మరో రూ.100 తీసుకుంటున్నారని, అక్కడ మెయింటెనెన్స్ చేసేదేమీ లేదని, ఆ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ట్రాక్టర్ల యజమానులు ఆరోపించారు. రోజు వేలాది రూపాయలు తమ నుంచి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు తెలియ జేసినా ఫలితం లేదని, నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, వీరికి కూడా మామూళ్లు ముట్టజెపుతున్నారని యజమానులు ఆరోపిస్తున్నారు. అక్రమ వసూళ్లు ఆపకపోతే ట్రాక్టర్లతో కొల్లూరులో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే అక్రమ వసూళ్ల విషయాన్ని రేపల్లె డీఎస్పీ, ఆర్డీవో దృష్టికి తీసుకు వెళ్లామని, అయినా వసూళ్ల పర్వం ఆగకపోవడంతో ఆందోళనకు సిద్ధమైనట్లు యజమానులు చెబుతున్నారు.


గాజుల్లంక రీచ్‌లో జరుగుతున్న ఇసుక తవ్వకాలు (ఫైల్)

నడికుడి-కుక్కడం డబ్లింగ్‌కు టెండర్

- రూ. 647.88 కోట్ల అంచనావిలువతో ప్యాకేజ్ రూపకల్పన
- రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు షరతు
- పూర్తి అయితే 48 కిలోమీటర్ల రెండు వరసల రైలు మార్గం అందుబాటులోకి

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కుక్కడం - కోండ్రపోలు మధ్యన పనులు ప్రారంభం కాగా మరో సెక్షన్ నిర్మాణాన్ని చేపట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. నడికుడి - కుక్కడం మధ్యన ఉన్న 48 కిలోమీటర్ల పొడవునా రెండో వరస రైలుమార్గం నిర్మాణానికి ప్యాకేజ్‌ని రూపొందించింది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో టెండర్లు పిలిచింది. రైలుమార్గంతో పాటు విద్యుదీకరణ, సిగ్నలింగ్ వర్కులను కూడా ఇందులో చేర్చింది. ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు రూ. 647.88 కోట్ల విలువ అవుతుందని అంచనా వేసింది. ప్రీబిడ్ కాన్ఫరెన్స్‌ని డిసెంబరు 12వ తేదీన ఉదయం 11.30 గంటలకి, బిడ్డింగ్‌ని జనవరి 18వ తేదీన నిర్వహించనుంది. గరిష్టంగా 30 నెలల్లో ఈ పనిని పూర్తి చేయాలన్న షరతుని కూడా టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.
గతశక్తి కార్యక్రమం కింద గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఒకే ప్యాకేజీ కింద కాకుండా నాలుగైదు ప్యాకేజీలుగా విభజించి చేపట్టడం వలన త్వరగా పనులు పూర్తి అవుతాయని రైల్వే శాఖ భావిస్తున్నది. ప్యాకేజీలన్నింటిలో అత్యంత కీలకం, క్లిష్టమైనది నడికుడి - కుక్కడం సెక్షన్. ఇందుకు కారణం పొందుగల వద్ద కృష్ణానదిపై రెండో రైలు వంతెనని నిర్మించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విష్ణుపురం వద్ద తెలంగాణ ప్రభుత్వం భారీ విద్యుత్ ప్లాంట్‌ని నిర్మిస్తున్నది. అక్కడ ఒక ఆర్‌వోబీ నిర్మాణం కూడా చేపడుతున్నది. కృష్ణానదిపై వంతెన నిర్మాణం అంటే అంత సులభతరం కాదు. అర కిలోమీటర్ పైగానే పొందుగల వద్ద కృష్ణానది వెడల్పు ఉన్నది. ఏటా వర్షాకాలంలో భారీగా వరదనీరు సాగర్ జలాశయం నుంచి విడుదల జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వరదల సమయంలో పనులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నది. అయినప్పటికీ కాలపరిమితిని 30 నెలలుగానే రైల్వే శాఖ నిర్ణయించింది.



2029 లోపే పూర్తి చేసే దిశగా అడుగులు

గుంటూరు - బీబీనగర్ రైలుమార్గం రెండు వరసలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను 2029వ సంవత్సరం లోపే పూర్తి చేసేందుకు రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నది. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాల సహాయంతో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియని కూడా ఇప్పటికే మొదలు పెట్టించింది. మరో రెండు, మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశాలున్నాయి. అప్పుడు అన్ని సెక్షన్లలో పనులు ప్రారంభమౌతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఏది ఏమైనా ఈ ప్రాజెక్టు పూర్తి అయితే గుంటూరు రైల్వే డివిజన్ మీదగా రైళ్లు, సరుకు రవాణ చేసే గూడ్స్‌ల రాకపోకలు పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది. అంతేకాకుండా గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన ప్రయాణ సమయం నాలుగు గంటల కంటే తక్కువ సమయానికి తగ్గిపోతుంది.

100 శాతం కావాల్సిందే

- జియో ట్యాగింగ్ విషయంలో సచివాలయ ఉద్యోగులకు టార్గెట్లు
- నేటితో పూర్తి కావాల్సిందేనని ఆదేశాలు
- 81 మందికి షోకాజ్ నోటీసులు
- క్షేత్రస్థాయిలో ఇబ్బందులపై సిబ్బంది ఆవేదన



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియ ఎట్టి పరిస్థితుల్లో బుధవారానికి పూర్తి కావాల్సిందేనని సచివాలయ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జియో ట్యాగింగ్ విషయంలో వెనకబడి ఉన్న కారణంతో బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని 81 మంది సచివాలయ ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ ఏకంగా షోకాజ్ నోటీసులు జారీ చేయడడంతో పని ఒత్తిడిని తట్టుకోలేకున్నామని సిబ్బంది వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రతికూలంగా ఉండడం వల్లే ప్రక్రియ నెమ్మదిగా జరుగుతుందని అయినప్పటికీ తమను వేధిస్తున్నారనేది సిబ్బంది మాటగా ఉంది. ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, కుటుంబ యజమాని అందుబాటులో లేకపోవడంతోడు ఇతర సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతుందని కానీ ఇవేవీ పట్టించుకోకుండా టార్గెట్ పూర్తి కావాల్సిందేనని తమను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తు న్నారని జియో ట్యాగింగ్ విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. మరోవైపు ఈ ప్రక్రియను రాష్ట్ర స్థాయి అధికారులు రోజూ మానిటరింగ్ చేయడంతో పాటు వెనకబడిన ఏరియాల విషయంలో వివరణ అడుగుతుండడంతో, సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు విధించక తప్పని పరిస్థితి ఎదురవుతుందని అధికారులు చెబుతుండడం గమనార్హం. ప్రతి ఇల్లు జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియ గడచిన పది రోజులుగా జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారానికి 80 శాతం ప్రక్రియ పూర్తికాగా బుధవారానికి వందశాతం పూర్తి చేయాల్సిందేనన్న ఆదేశాలు సచివాలయసిబ్బందికి వచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యలంక తీరంలో బీచ్‌వాలీబాల్ పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు


8
అంతర్‌జిల్లాల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

ముగిసిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ప్రథమ స్థానంలో నిలిచిన రోజా ఎవేంజలిన్‌కు ప్రశంసా పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు, క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కన్నా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలని, వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం ఉంటే గొప్ప శాస్త్రవేత్తలుగా తయారవుతారని అన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముందుగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆధ్వర్యంలో కన్నాను ఘనంగా సన్మానించారు.

'విశాఖ'కు ప్రథమ బహుమతి

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లాకు చెందిన ఎం రోజా ఎవేంజలిన్, ప్రవల్లిక, సాయి ప్రియలకు ప్రథమ బహుమతిని, ద్వితీయ బహుమతి మన్యం జిల్లాకు చెందిన గౌతమ్‌లకు ప్రశంసా పురస్కారం, షీల్డ్‌లతో పాటు మరో 30 మందికి నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాలల అడిషనల్ సెక్రటరీ కే సునీల్‌రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సంజీవ రావు, జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ, కళాశాల ప్రిన్సిపల్ జాన్‌సన్, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ఉన్నారు.

ప్రకృతి, సాంకేతికతలలో వికృతత్వం లేదు

పెదకాకాని, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, మారుతున్న సాంకేతికతలలో వికృతత్వం లేదనీ, మనిషి ఆలోచనలలోనే వికృత భావాలు ఉన్నాయని, మనిషి తన మేధస్సును సమాజ హితం కోసం ఉపయోగించాలని ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పాత్రికేయవిద్యా విభాగంలో మంగళవారం 'విలువలతో కూడిన పాత్రికేయం' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయం అంటే ప్రజా సమస్యలపై పోరాడే పాశుపతాస్త్రం అని అన్నారు. వ్యక్తిగత వికాసానికే కాకుండా, పది మంది పురోగతికీ ఉపయోగపడాలన్న కోరిక ఉన్న వారికి సరైన ఎంపిక పాత్రికేయ రంగ మని వ్యాఖ్యానించారు. పాత్రికేయ రంగంలో గత ఆరు దశాబ్దాలుగా వచ్చిన మార్పులను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లుగా సోదాహరణంగా విపులీకరించారు. పాత్రికేయ వృత్తిలో ప్రతిభాపాటవాలు చూపితే సమాజంలో పేరుప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చని ఫ్రీలా న్స్‌గా కూడా పని చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. జర్నలిస్టులకు సామాజిక బాధ్యత తప్పనిసరిగా ఉండాలని, ప్రజా ప్రయోజనాలే పరమావ ధిగా భావించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగని మనస్తత్వం అవ సరం అని మంచి వార్తలు, వార్తల్లోని జీవన స్థితి గతులను గుర్తించే నేర్పు ముఖ్యం అని సూచించారు. కార్యక్రమంలో పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతి ర్మయి, టీవీ అండ్ ఫిల్మ్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య జే మధుబాబు, అధ్యా పకుడు ఎం మాణిక్యరావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,787 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,918 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,918 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది



ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి, దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ

- అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ

తాడేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ 47వ రోజుకు చేరుకుంది. ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి తమ సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తులను పరిశీలించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సంబంధిత శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా ఇవ్వడంతో అర్జీదారులు సంతోషపడ్డారు. దివ్యాంగుల నుంచి కూడా వినతిపత్రాలు స్వీకరించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరుకు వినతి

గుంటూరులోని ఎన్టీఆర్ అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (గుంటూరు మిర్చియార్డు)లో కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌లు మంజూరు చేయాలని టీ లక్ష్మారెడ్డి, షేక్ చినబాజి, విజ్ఞప్తి చేశారు. 2018లో కుటుంబ జీవనోపాధి కోసం కొంతమందికి మిర్చి వ్యాపారం చేసుకునేందుకు కమీషన్ లైసెన్స్ మంజూరు చేసేందుకు అప్పటి పాలకవర్గం యార్డు సెక్రటరీ తీర్మానం చేశారని, అనంతరం వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్యోగావకాశం కల్పించండి

తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన తండ్రి గుండెపోటుతో 2006లో మరణించారని, అన్ని అర్హతలు ఉన్న తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన సరిశెట్టి సాయి సునీత విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ లైంగిక వేధింపులు

తనను లైంగికంగా వేధించిన తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ కేవీఎస్ రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్న ఓ మహిళ ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్‌పై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, తనను అక్రమంగా బదిలీ చేశారని, న్యాయం చేయాలని కోరారు.

విలువైన భూములు ఆక్రమించారు

తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులమనే కక్షతో గత వైసీపీ పాలనలో తమపై అక్రమంగా కేసులు నమోదు చేయడంతోపాటు విలువైన తమ భూములు ఆక్రమించు కున్నారని సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం రెక్కమానుకు చెందిన కేసుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి దురాగతాలతో తాము ఊరి విడిచి వెళ్లాల్సి వచ్చిందని, అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

భూములు కోల్పోయాం.. న్యాయం చేయండి

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని కడప జిల్లా, యర్రగుంట్ల మండలం, ఇండ్లసిద్దాయపల్లె భూనిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

స్థలం ఆక్రమించి నిర్మాణాలు

నెల్లూరు జిల్లా ముత్తుకూరులో తమ 320 చదరపు గజాల స్థలాన్ని ఏ శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆక్రమించిందని, విచారణ చేసి న్యాయం చేయాలని పూడిపర్తికి చెందిన ఇందిరమ్మ విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానంలో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా, దౌర్జన్యంగా తమ స్థలంలో నిర్మాణాలు చేశారని, పోలీసులు పట్టించుకోలేదని న్యాయం చేయాలని కోరారు.

కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

- ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి
- తప్పులు రహిత ఓటర్ల జాబితా రూపొందించాలి



సమావేశంలో శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ సూర్యకుమారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులు లేని ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు కృషి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా పరిశీలకులు సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల సవరణలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సూర్యకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా పరి శీలించాలని అన్నారు. రానున్న నెల రోజుల్లో ఓటర్ల జాబితాల రూప కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, ఇందుకు బీఎల్‌ఓ. ఈఆర్‌ఓలు సమా వేశం నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 18-20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతను ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా నమోదుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ సమయంలో ఈపీ రేషియో, జెండర్ రేషియో అం శాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించుకోవాలని, ఓటరుగా నమోదు, సవరణకు అరు లైన వారు ఫారం 6, 7, 8 దరఖాస్తు ఫారాలను భర్తీ చేసి అందజేయాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయపక్షాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడూతూ జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజవర్గాల్లో ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబరు 29 నాటికి 17,35 365 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వారిలో 8,46,793 మంది పురుషులు ,8,88,385 మంది మహిళలు, 187 మంది ఇతరులు ఉన్నట్లు వివ రించారు. జిల్లాలోని 1932 పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని, 2025 ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నవంబరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. డిసెంబరు 24 నాటికి అభ్యంతరాలను పరిష్కరించడం పూర్తిచేస్తామని, తుది జాబితాను 2025 జనవరి 6న ప్రకటించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్‌వో ఐమురళీ తదితరలు పాల్గొన్నారు.

నా జీవితానికి మా నాన్నే స్ఫూర్తి

- ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నాం
- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు
- వేడుకగా సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభ



పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో ఎదగడానికి మా నాన్న అందించిన జీవిత విలువలు అమూల్యమైనవని, ఉద్యోగంలో, జీవితంలో ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నానని డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై మంగళవారం జరిగిన సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తన చిన్నతనంలోనే తన తండ్రి పదవీ విరమణ పొందారని అన్నారు. ఆయన నిరాడంబరంగా జీవించారని, సమర్థతతో పాటు, నీతి నిజాయితీలకు లోబడి పనిచేశారని గుర్తుచేశారు. ఆయన పేరుతో అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న అవార్డుల ప్రక్రియ వెనుక తన సోదరి సుశీలమ్మ చేస్తున్న కృషి గొప్పదన్నారు. అవార్డులను స్వీకరిస్తున్న పాపినేని శివశంకర్, జీఎస్ చలంను అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ సాహిత్య విమర్శకులను గుర్తించి, గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించి గత ఐదేళ్లగా ప్రముఖులకు తమ తండ్రి పేరున పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలం మాట్లాడుతూ కవిత్వానికి, కథకు పురస్కారాలు ఇస్తారు కానీ సాహిత్య విమర్శకు అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి పురస్కారాలతో మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. అనంతరం 2023 సంవత్సరానికి పాపినేని శివశంకర్‌కు, 2024 సంవత్సరానికి ప్రముఖ విమర్శకు రచయిత చలంకు డీజీపీ చేతుల మీదగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహమద్ షరీఫ్, డాక్టర్ ఓ వీ రమణ, డాక్టర్ వీవీ రామకుమార్, పలు రచయితలు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో కార్తీక వన సమారాధన

- వన భోజనాల్లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు



గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): తెలుగు ప్రజలు ఎక్కడున్నా మన సంస్కృతి, సంప్ర దాయాలకు పెద్దపీట వేస్తూనే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి, ప్రతి కుటుంబం శ్రద్ధా భక్తులతో జరుపుకునే కార్తీక వన సమారాధన సువాసనలు జపాన్‌లోనూ వ్యాపించాయి. జపాన్‌లో నివాసం ఉంటున్న తెలుగు ప్రజలు టోక్యోలోని ఓజీమాకు వచ్చి కార్తీక వనసమారాధన జరుప ుకున్నారు. ఈ సందర్భంగా పురుషులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటాపాటలతో తెలుగు వారి ఐక్యతను చాటారు. చివరిలో పసందైన విందు భోజనంతో వన దేవతకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తెలుగు ప్రజలందరూ పాల్గొన్నట్లు జపాన్ తెలుగు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రతి తెలుగు పండుగ జపాన్‌లో జరుపుకుంటునట్లు పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయం, ముఖ్యంగా పండుగ రోజు కనిపించే వస్త్రధారణ అక్కడి ప్రజలను అమితంగా ఆకట్టుకుంటాయని తెలిపారు.



ఫిట్‌నెస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐజీ త్రిపాఠి

ఎస్సై ఉద్యోగోన్నతులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సై ఉద్యోగోన్నతుల కోసం నిర్వహించిన పరీక్షలను సౌత్ కోస్టల్ జోన్ రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ పకడ్బందీగా నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమాండెంట్ ఎస్పీ నగేష్ బాబు, ప్రకాశం జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గుంటూరు రేంజ్ పరిధిలోని 5 జిల్లాలు గుంటూరు, ప్రకాశం బాపట్ల, నెల్లూరు, పల్నాడులలో పనిచేస్తున్న 58 మంది ఎస్సై స్థాయి ఉద్యోగోన్నతి కోసం ఔట్ డోర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షార్థులకు నీట్ టర్న్ అవుట్, ఫుట్ డ్రిల్, వెపన్ డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, మార్చ్ పాస్ట్, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ మొదలగు వివిధ అంశాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు.

పంచాయతీ సెక్రటరీ వేధింపులు తాళలేక మరణిస్తున్నా..

- తాళ్లపల్లి సచివాలయ సర్వేయర్ యేసురాజు సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియో చేస్తున్న సర్వేయర్ యేసురాజు

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నానని సచివాలయ సర్వేయర్ సెల్ఫీ వీడియో కలకలం రేపుతుంది. వివరాలు ఇలా వున్నాయి. పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఆవుల వెంకట్రామయ్య తనను వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేక మరణిస్తున్నానని అదే గ్రామ సచివాలయ సర్వేయర్ యేసు రాజు సెల్ఫీ వీడియో చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతూ కలకలం రేపుతోంది. గ్రామ సమీపంలోని సాగర్ కుడికాలువ వద్ద మంగళవారం ఈ సెల్ఫీ వీడియో చేశారు. తన పేరు యేసురాజు అయినప్పటికీ తాను యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని, అయితే నువ్వు మాదిగ కులానికి చెందిన వాడవురా.. నేను చెప్పినట్లు నువ్వు వినాలి.. నా కాళ్ల బూట్లు తుడవాలి అంటూ వెంకట్రామయ్య వేధిస్తున్నారని యేసురాజు తన సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య వేధింపులు తాళలేక మరణిస్తున్నానని, ఈ వీడియోనే తన మరణ వాంగ్మూలంగా భావించాలని ఆ వీడియోలో యేసురాజు చెప్పారు. కాగా వీడియో అనంతరం యేసురాజు కనిపించడం లేదు. దీనిపై మాచర్ల రూరల్ పోలీసులను వివరణ కోరగా విచారిస్తున్నట్లు చెప్పారు.

సోషల్ మీడియాలో దూషణలపై రిమాండ్

- నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరుటౌన్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులను సోషల్ మీడియా వేదికగా అసభ్య దూషణలకు, అసత్య ప్రచారానికి పాల్పడ్డ వైసీపీ కార్యకర్త షేక్ గోపిలాల్‌ను రూరల్ పోలీసులు ఆదవారం అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది. 2020వ సంవత్సరంలో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్నారని, అక్రమంగా భూములు కొనుగోలు చేశారని, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ కొందరు వైసిపి నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశారు. ఈ విషయమై 2020లోనే నరేంద్ర కుమార్ కటుంబ సభ్యులు సాక్ష్యాలతో సహా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిపై విచారణ చేపటట్టలేదు. పోలీసులను నరేంద్రకుమార్ ప్రశ్నించినప్పటికీ వారి నుంచి సమాధానం కరువైంది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఈ కేసు వెలుగు చూసింది. రూరల్ ఎస్సై గండు కిరణ్ ఈ కేసు విచారణను తిరిగి ప్రారంభించి, ప్రధాన నిందితుడిగా పెదకాకాని మండలానికి చెందిన షేక్ గోపిలాల్‌ని అరెస్టు చేశారు. ఈ అసత్య ప్రచారాలు సాగించమని కీలక వైసీపీ నాయకులు తనకు బాధ్యతలు అప్పగించారని పోలీసుల విచారణలో గోపిలాల్ వెల్లడించటంతో మరో 12 మందిని ఈ కేసులో నిందితులుగా రూరల్ పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలువురు వెసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తాజా మాజీ ప్రజా ప్రతినిధి కిలారి వెంకట రోశయ్య కూడా నిందితుడిగా ఉనట్లు సమాచారం. కిలారి ప్రోద్బలంతోనే ఈ అసత్య ప్రచారం సాగించినట్లు గోపిలాల్ విచారణలో వెల్లడించినట్లు సమాచారం. దీనిపై రూరల్ ఎస్సై కిరణ్‌ను వివరణ కోరగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒక నిందితుడిని అరెస్టు చేశామని, మిగిలిన వారి కోసం గాలిస్తునట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇసుకపల్లికి చెందిన నీలం శ్రీనివాసులు (32) తన ద్విచక్రవాహనంపై రేపల్లె నుండి ఒంగోలుకు వెళుతుండగా బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై వెళుతున్నాడు. వేగంగా ద్విచక్రవాహనం నడుపుతుండగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న టాటా ఏస్ ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఈ మేరకు రూరల్ పోలీసులకు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ కె.గంగాధరరావు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివన్నారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్నఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్

పిట్టలవానిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని రజకపాలెం గ్రామానికి చెందిన మేత్ర శివన్నారాయణ (56) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత భేదాభిప్రాయాల కారణంగా తన భార్యా పిల్లలు నుంచి వేరుబడి జీవిస్తున్న శివ న్నారాయణ, కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమ వారం రాత్రి తన స్వగృహంలోని ఇంటికప్పుదూలానికి శివన్నారాయణ ఉరివేసుకున్నాడు. శివన్నా రాయణ అన్న కుమారుడు మేత్ర ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు.

అర్ధరాత్రి కోడి పందేలు

- గాజుల్లంక ఇటుక కల్లాల్లో ..
- పోలీసుల రాకతో పారిపోయిన పందెంరాయుళ్లు

కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి భారీ స్థాయిలో కోడిపందేల బరిలు ఏర్పాటు చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేయడంతో పందెంరాయుళ్లు పరారయ్యారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇటుక కల్లాల్లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో డీజే వాయిద్యాలతో కోడి పందేలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. భారీ స్థాయిలో కోడి పందేలు జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఏడుకొండలు సిబ్బందితో కలిసి ఆ స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వ హించారు. దీంతో పందెం రాయుళ్లు పరారయ్యారు. నలుగురు వ్యక్తులను, ఒక కారు, ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కోడిపందేల బరిని గాజుల్లంకకు చెందిన మత్తి నరేంద్ర అనే వ్యక్తి ఏర్పాటు చేశాడని సమాచారం ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిని కూడా అదుపులోకి తీసుకో నున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

46,945 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,929 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,945 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 36,376 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	14000	334	8000	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	8500	12000
273	8000	9000	273	--	--
341	9000	14000	341	10000	14500
4884	10500	10500	4884	8000	12000
సూపర్ 10	12000	14000	సూపర్ 10	13300	13300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300	తేజ	8000	16500
బ్యాడిగి	7500	12500	బ్యాడిగి	9500	12500
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	9000	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

వేమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చదలవాడ, కార్కూమూడి గ్రా మాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత క్షేత్రాలను సందర్శించారు. అనంతరం గ్రామ సభలు ఏర్పాటు చేశారు. సభలో ఆమె మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి

రేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సమాజంలో మహిళలను గౌరవించి అంబేద్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్త్రీలపై గృహహింసకు పాల్పడరాదని, ప్రతి ఒక్క మహిళ స్వేచ్ఛగా పురుషులకు సమానంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆనందరావు, డ్వాక్రా యానిమేటర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూడివాడ మాజీ ఎంపీటీసీ పాగోలు బాలకోటేశ్వరరావు, షేక్ కరిముల్లా, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

చిలుమూరులో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ఏకాదశి పురస్కరించుకుని మండల గ్రామం చిలుమూరులోని ఉభయ రామేశ్వర క్షేత్రం వద్ద వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు మంగళవారం నిర్వహించారు. అనంతరం ఉభయ రామేశ్వర క్షేత్రంలో అన్న సంతర్పణ జరిగింది. కొల్లూరులో అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామికి విశేష అలంకారాలు చేశారు. కార్యక్రమాలను వ్యవస్థాపక ధర్మకర్త హరిదుర్గానాగేశ్వరరావు, ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భవ్యభూషణునిగా దర్శనమిచ్చిన రామలింగేశ్వరస్వామి

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలలో చివరి మంగళవారం రోజున ప్రాతఃకాల అభిషేకం అనంతరం స్వామివారు అత్యంత విశేషమైన భవ్య భూషణునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రసాదస్వామి ఆధ్వర్యంలో గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, నెమలికంటి హనుమంతరావు సహకారంతో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త హరి నారాయణ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

భక్తి ప్రపత్తులతో కోటి దీపోత్సవం

వేమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రసిద్ధిగాంచిన జంపని శ్రీరామేశ్వరాలయంలో మంగళవారం రాత్రి కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తి ప్రపత్తులతో కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. పండిత మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులు శివలింగం, స్వస్తిక్ త్రిశూలం ఆకృతులలో కోటి దీపాలను వెలిగించి శివునికి నీరాజనం పలికారు. పండితులు పంచ సూక్తాలు, రుద్ర నమక చమకాలు వల్లించారు.

విలేకరిపై కేసు నమోదు

బాపట్లరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళను మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన ఓ విలేకరిపై బాపట్ల రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు తెలిపిన వివరాలు ప్రకారం... ఒంగోలుకు చెందిన షేక్ మాగ్బుల్ ఆలి ఓ పత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల గెట్ టు గెదర్ కార్యక్రమంలో స్నేహితులతో కలిసి పాల్గొన్నాడు. వీరిలో కంకటపాలెం గ్రామానికి చెందిన పాఠశాల ఉపాధ్యాయులిగా పని చేస్తున్న షేక్ కరీమా మొబైల్ నెంబరు తీసుకొని ఆమెతో అసభ్యపదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆ మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వటంతో అతనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

రేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నం మండలం అదవల మడ అడవుల్లోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ ఎం.శ్రీరామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, కె.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా జీవించటానికి రాజ్యాంగం దోహదం



అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి



అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కూటమి నాయకులు

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని భిన్నకులాలు, మతాలు, రాజకీయ అసమానతలను తొలిగించి ఐక్యతతో జీవించటానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. 75వ భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ దగ్గర కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అధికారులు, విద్యార్థులతో కలిసి పాతబస్టాండ్, గడియార స్తంభంసెంటర్ మీదగా అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని అక్కడ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో జీవించే హక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిందన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడినవారిగా గుర్తించిన ఎస్సీఎస్టీ, బీసీ లకు అన్నింటిలో రిజర్వేషన్ కల్పించిందన్నారు. ఓబీసీలకు రిజర్వేషన్‌లు కల్పించిన ఘనత భారతరాజ్యాంగానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్రనాయకులు శీలం రోజన్‌బాబు, ఎంఇవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి సరోజినీ, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి ఝాన్సీరాణి తదితర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్‌లో మంగళవారం భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు, దళిత నాయకులతో కలిసి అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయాలలో సమానత్వానికి ప్రజాస్వామ్యం సంరక్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధరగౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, దళిత నాయకులు డాక్టర్ జి.చార్వాక, శీలం రోజన్‌బాబు, కాగిత కోటేశ్వరరావు, డాక్టర్ గుదే రాజారావు, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జె.రాజాదెబోరా తదితరులు పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణానికి చేసిన కృషిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్దదైన ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును విజయవంతంగా జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, ఉమ్మడిజిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు పమిడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తదితరులు

● జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పోలీసు అధికారులతో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి రాజ్యాంగ బద్దంగా నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏవో వి.శ్రీనివాసరావు, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీనివాసరావు, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం బాపట్ల నియోజకవర్గ వైసీపీ నాయకులు మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ చినపోతుల హరిబాబు పార్టీశ్రేణులతో కలిసి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సభలో ప్రసంగించారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను వివరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు జోగి రాజా, వడ్డిముక్కల డేవిడ్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, మాజీ వైస్ ఛైర్మన్ పిన్నిబోయన ప్రసాద్, మత్స్యశాఖ మాజీ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల అధ్యక్షులు చల్లా రామయ్య, ఎంపీటీసీ సుబ్బారావు, యూత్ అధ్యక్షులు ఆట్ల ప్రసాదరెడ్డి, మాజీ సర్పంచ్‌లు జొన్నల గడ్డ ఇస్సాకు, నత్తల శామ్యూల్ పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి భారతదేశంలో ప్రజలందరికి సమాన అవకాశాలు వస్తున్నాయంటే దానికి కారణం భారతరాజ్యాంగమన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి టీచర్స్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి రాజ్యాంగ ఆమోద దినోత్సవం గురించి వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.లావణ్య, ఆర్‌సి శశికుమార్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2, 3 ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన విషయాలను విద్యార్థులకు తెలిపారు.

● కర్లపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా కర్లపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, డీటీ శ్రీదేవి, ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి తదితరులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏట్రవారిపాలెం గ్రామపంచాయతీలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, కార్యదర్శి ఆట్ల మురళీ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, నల్లమోతువారిపాలెంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీసీ తాండ్ర సాంబశివరావు, పి.వెంకటేశ్వరరావు, మాడా శ్రీనివాసరావు, కర్లపాలెం హైవెండ్ హైస్కూల్‌లో మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, ఛైర్మన్ ఉదయచంద్రరావు, ఉపాధ్యాయులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ రవీంద్ర, పలువురు నాయకులు నివాళులర్పించారు.

● వేమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి తహసీల్దార్ సుశీల, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించి భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్ప లిఖిత రాజ్యాంగంగా పేర్కొనడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.సత్యనారాయణరావు కార్యాలయ సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో మంగళవారం శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు గోకరాజు కృష్ణంరాజు, రుద్రరాజు విజయరామరాజు, వేగేశన బద్రినారాయణలు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వేగేశన నాగరాజు, మన్నెం ఉదయ్‌భాస్కర్, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

● మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, పలు గ్రంథాలయాలు తదితర కార్యాలయాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

● రేపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మత్తి భాస్కరరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పర్యటించి ఉత్తమ పరిపాలన విధానాలతో సర్వోత్తమ లిఖితపూర్వక రాజ్యాంగం అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.వెంకయ్య, బి.రవీంద్ర, రామకృష్ణ, రాజభూషణం, కె.రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

● భారతదేశానికి అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే మహోన్నతమని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 75వ రాజ్యాంగ వేడుకలను ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు, కొల్లూరు మండల పరిషత్ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయ భాస్కరి, ఎంపీడీవోలు రమణ, కె.నరసింహారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● చుండూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని గొప్పదైన ప్రజాస్వామ్యమైన వ్యవస్థను పరిరక్షించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్ర మరువలేనిదని మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దేవరపల్లి అనీల్ కుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ అధ్యక్షుడు వినోద్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పలువురు కేంద్రమంత్రులను కలిసిన ఎంపీ తెన్నేటి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని రైల్వేలైన్‌లు, నూతన రోడ్లు, పరిశ్రమల ఏర్పాటు గురించి చర్చించారు. భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి పార్లమెంట్ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కోరారు. రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్‌గౌర్‌ను కలిసి చీరాలలో వందేభారత్ రైలు నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ-గూడూరు మధ్య 4వ లైన్ ఏర్పాటు గురించి, రేపల్లె-తెనాలి మధ్య రెండో లైన్, రేపల్లె-బాపట్ల మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు గురించి చర్చించి వినతిపత్రం సమర్పించారు. జాతీయ రహదార్ల శాఖ సెక్రటరి ఉమామహేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి ఎన్‌హెచ్ 216ను నాలుగు లైన్‌ల రోడ్డుగా విస్తరించాలని, స్టేట్ హైవే 40ని గుంటూరు-బాపట్ల మధ్య నేషనల్ హైవేగా అభివృద్ధి చేయాలని, నిజాంపట్నం-గుంటూరు మధ్య నూతన రోడ్డు వేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. మెగాపేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిసెంబరు 7న బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం ముందస్తు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధికి విద్యార్థులే వెన్నెముకలాంటివారని గుర్తించి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జవాబుదారితనంతో ఉపాధ్యాయులు పనిచేయాలని, చక్కగా విద్యాబోధనం దించాలన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తూనే వారి భవిష్యత్తు నిర్మాణానికి ప్రభుత్వం బాటలు వేస్తుందని తెలిపారు. విద్యార్థుల స్థాయిని గుర్తించి మట్టిలోని మాణిక్యాలను వెలికితీయటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ దేశనిర్మాణం తరగతి గదిలోనే ప్రారంభమౌతుందన్నారు. ఆర్డీవో పి.గ్లోరియా మాట్లాడుతూ దేశంలో మేధావులు, శాస్త్రవేత్తలు పాఠశాలలో ఓనమాలు దిద్దినవారేనని చెప్పారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని గొరికపూడి గ్రామానికి చెందిన వరికూటి లక్ష్మీసుజాత, భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఎ.భవానిలు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. బాధితులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సిఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లక్ష్మీసుజాత కుటుంబ సభ్యులకు రూ.1,79,754, ఎ.భవాని కుటుంబ సభ్యులకు రూ.40 వేలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇసుక బస్తాలు వేసి దిగువకు సాగునీరు అందిస్తాం

● వెల్లటూరు చానల్‌ను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ రాంబాబు




చప్టాను పరిశీలిస్తున్న కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు, ఎస్ఈ వెంకటరత్నం తదితరులు

భట్టిప్రోలు, (కొల్లూరు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూలిపోయిన వెల్లటూరు చప్టాను కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు మంగళవారం పరిశీలించారు. భట్టిప్రోలు సంగం డెయిరీ సమీపంలో బీఆర్ డ్రెయిన్‌పై ఉన్న వెల్లటూరు ఛానల్ కాలం తీరి కూలిపోవడంతో నగరం మండలంతో పాటు తీర ప్రాంత గ్రామాల రైతులకు రెండు రోజులుగా సాగు నీరు అందడం లేదు. కూలిపోయిన చప్టాను సాగునీటి శాఖాధికారులు పరిశీలన చేశారు. ప్రస్తుత సీజన్‌లో దిగువ ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు చప్టా వద్ద ఇసుక బస్తాలు వేసి సాగునీరు దిగువకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి స్థాయిలో అంచనాలు రూపొందించి శాశ్వత నిర్మాణం పనులు చేపడతామని అన్నారు. పరిశీలనలో ఎస్ఈ వెంకటరత్నం, డీఈ దీనదయాళ్, ఏఈ సువర్చల, సిబ్బంది, టీడీపీ నాయకులు మోటూరి పుణ్యశ్రీనివాసరావు, దివి చంటి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

● విద్యుత్ దీపాలతో చర్చిలు అలంకరణ
● పెద్దఎత్తున స్టార్‌లు ఏర్పాటు



విద్యుత్ దీపాలతో అలంకరించిన సీబీజెడ్‌చర్చి



బలిజేపల్లిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబరు 25వ తేదీ వరకు ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు జరుపుకుంటారు. ప్రతిరోజు తెల్లవారుజామునే ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతం గురించి దైవసేవకులు వివరించి ప్రార్థనలు చేస్తారు. ఈనేపథ్యంలో బాపట్ల పట్టణంలోని చరిత్ర కలిగిన సీబీజెడ్ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెంగల్‌విహార్ యూత్ వారు చీలురోడ్డు సెంటర్‌లో క్రిస్మస్‌స్టార్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణ వీధులలో, గ్రామాలలో క్రిస్మస్ నక్షత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నెలరోజులపాటు జరిగే ఈ వేడుకలకు అన్ని సంఘాల చర్చిలు ముస్తాబు అయ్యాయి.

పండుగలు సంప్రదాయాలు చాటుతాయి

వేమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పండుగల సంప్రదాయాలు ఐకమత్యాన్ని చాటుతాయని, పూర్వకాలం నుంచి వస్తున్న విధానాలను వదిలిపెట్టకుండా ఆచరణలో ఉంచాలని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. మండలంలోని బలిజేపల్లి గ్రామంలో రాజా రవీంద్ర యూత్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దొప్పలపూడి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిస్మస్ స్టార్‌ను ప్రారంభించారు. 300 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు దూరంగా కలిసి మెలిసి జీవనం సాగించాలని, అప్పుడే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆనందబాబును సత్కరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నక్కా అఖిలేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు కోగంటి విశ్వం, డాక్టర్ భాగ్యలక్ష్మి, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నిజాంపట్నం సత్యనారాయణ, రాజా రవీంద్ర యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వీరారెడ్డి ఎంపిక

పిట్టలవానిపాలెం, నవంబరు 26 : స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సమ్మెట వీరారెడ్డి స్కూల్ గేమ్స్ గుంటూరు జిల్లా క్రికెట్ జట్టుకు అండర్-17 బాలుర విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ప్రశాంత్‌బాబు తెలిపారు. ఈ విద్యార్థి డిసెంబరు రెండో వారంలో మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో గుంటూరు జిల్లా జట్టు తరుపున ఆడేందుకు ఎంపికయ్యాడని చెప్పారు. వీరారెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వీరాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

● సంయుక్త కిసాన్‌మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం బాపట్లలోని చీలురోడ్డు సెంటర్‌లోని చివుకుల శేషశాస్త్రి సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ముప్పల పల్లవి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకుడు కారుమంచి విజయ్‌కుమార్, ఏపీ రైతు కూలీసంఘం నాయకులు మండవ శోభారాణి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో...

రైతు కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా పాత బస్టాండ్ వరకు వెళ్లారు. నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ విధానాలను కేంద్ర సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వసంతరావు, టి.రామారావు, కె.రామకోటేశ్వరరావు, సురేష్, వేములపల్లి వెంకటరామయ్య, హరిబాబు, నాగేశ్వరరావు, మల్లారెడ్డి, జి.సుధీర్, పోతురాజు, కె.శరత్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయం వద్ద...

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. భట్టిప్రోలు రెవెన్యూ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, జాతీయ రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేశారు. నాయకులు బండారు శ్రీనివాసరావు, జి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారి ఆర్థిక విధానాలకు వత్తాసు పలుకుతూ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు గొట్టిముక్కల బాలాజీ, ముదుగుడు సత్యనారాయణ, జి.నాగరాజు, ఎ.శ్రీనివాసరావు, వీరమోహన్‌రావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బావుడా ఛైర్మన్‌గా నియామకపత్రం అందుకున్న సలగల




రాజశేఖరబాబుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న మంత్రి పి.నారాయణ

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమించబడిన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబుకు మంగళవారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ నియామకపత్రం అందజేశారు. మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయిన అనంతరం నియామక పత్రం అందించి అభినందించారు. బావుడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సలగల తెలిపారు.

పౌష్ఠికాహారంతో ఆరోగ్యం పదిలం

● స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పౌష్ఠికాహారం తీసుకోవటం ద్వారా కిశోరి బాలికల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా తెలిపారు. పట్టణంలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో మంగళవారం కిశోరి వికాసం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కిశోరి బాలికలు నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజా దెబోరా, బీసీ డీఈవో చారులత, ఆర్ఐవో ఎర్రయ్య, పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రణయ్, లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి, డీసీపీవో పురుషోత్తమరావు, ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణప్రియ, ఎల్‌సీపీవో మౌనిక, కోఆర్డినేటర్ కిశోర్, ట్రైనర్ డాక్టర్ భూషణరావు, డాక్టర్ సందీప్, ఆనంద్, రవికిరణ్, ఉషా పాల్గొన్నారు.



ఇలా తగ్గాలి..

- అయోమయంగా వెయిట్ లాస్ పద్ధతి
- ఆహారపు నియమాలు పాటించకపోతే అసలుకే ఎసరు
- బరువు తగ్గినంత మాత్రానా ఆరోగ్యంగా ఉన్నట్టు కాదు
- శరీరంలో కొవ్వు లేకుండా చూసుకోవాలి
- డైట్, వ్యాయామాలతోనే సాధ్యం
- ప్రకటనలపై అప్రమత్తం ఉండాలంటున్న వైద్యులు



ఈమధ్య అందరని వేధిస్తున్న సమస్య అధిక బరువు.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఈ సమస్యతో బాధపడుతున్నారు. కూర్చోని పనిచేయడం, శారీరక శ్రమ అంతగా లేకపోవడం, వ్యాయామంకు దూరమవ్వడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం వంటి కారణాలతో ఒబెసిటి బారిన పడతున్నారు. వంశపారపర్యంగా గాకుండా కేవలం మన నిర్లక్ష్యం వల్ల వచ్చేదాన్నే ఒక విధంగా ఓబెసిటీ అనవచ్చు. అటుపై గుండె సంబంధిత, చక్కెర వంటి వ్యాధులు సహజంగానే శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సమస్య అన్ని వయస్సుల వారిని వేధిస్తుంది. అందుకే చాల మంది బరువుతగ్గాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాస్త తగ్గగానే ఆరోగ్యంగానే ఉన్నట్టు భావిస్తుంటారు. కానీ తగ్గించుకోవాల్సింది బరువు కాదని....శరీరంలోని కొవ్వునని నిపుణులు చెబుతున్నారు.ఈ చిన్న తేడాను గమనించలేక అనేక మంది వెయిట్‌లాస్ విధానాన్ని సరైన మార్గంలో చేయలేకపోతున్నారు. ఇలా చేయడం వల్ల అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గుంటూరు(తూర్పు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషికి శారీరకశ్రమను తగ్గించింది. దీంతో ఎక్కువ మంది వయస్సు, శరీరం నిర్మాణంతో సంబంధం లేకుండా అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ బరువుకు కారణం శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలే... తినే ఆహారంలో పిండిపదార్థాలు, కార్బొహైడ్రేట్లు, ఎక్కువ సార్లు రీఫైనరి చేసిన పదార్థాలు ఉండటమే దీనికి కారణం. అంతేగాక బరువును తగ్గించుకునే క్రమంలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోరు. దీంతో ఇతర అనారోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటారు. అసలు బరువు తగ్గడం అంటే ఏంటి అనే విషయంపై చాలమందికి అవగాహన ఉండదు. అందుకే బరువును తగ్గిస్తాం అనే ప్రకటనలు చూసి మోసపోతుంటారు. మరి కొంత మంది వ్యాయామం, వాకింగ్ వంటివి చేసి ఆహారపు నియమాలను పాటించరు. వీటి వల్ల తాత్కాలిక ప్రయోజనం ఉంటుంది కాని శాశ్వత పరిష్కారం లభించదని నిపుణులు తెలుపుతున్నారు. వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకున్నప్పుడే ప్రయోజనాలు ఉంటాయని సూచిస్తున్నారు.

డైట్ నియమాలు పాటించాలి

అధిక బరువుతో బాధపడుతున్నవారు ఆహారపు నియమాలను తప్పనిసరిగా పాటించాలి అప్పుడే శరీరంలో ఉన్న కొవ్వును తగ్గించుకోగలుగుతాం. పిండిపదార్థాలు, కార్బోహైడ్రేట్లు, పిల్లలు అయితే జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది మొత్తం పొట్ట, ఇతర భాగాల్లో పేరుకుపోతుంది. ఇటువంటి కొవ్వును కరిగించాలంటే ప్రొటీన్ ఉన్న ఆహారంతోనే సాధ్యమవుతుంది. దీనినే ప్రొటీన్ డైట్ అని కూడా అంటారు. దీని వల్ల కొవ్వు తగ్గడంతో పాటు, శరీరంలో మజిల్స్ పవర్ (కండరాల శక్తి) శాతంకూడా పెరుగుతుంది. అసలు 80 శాతం డైట్, 20 శాతం వ్యాయామం ఉంటే శరీరంలో కొవ్వును తగ్గించుకోవచ్చుని నిపుణులు సూచిస్తున్నారు.

వర్కవుట్ల తర్వాత ఇవి తినండి...

వర్క్‌వుట్ సెషన్ తరువాత స్వల్పకాలవ్యవధిని అనబాలిక్ విండ్‌గా పిలుస్తారు. ఈ సమయంలో వ్యాయామం చేసిన వ్యక్తి కండరాల ఎదుగుదలకు రికవరీకి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్కవుట్స్ సమయంలో కండరాలు చాలా సున్నితంగా మారతాయి. కొన్నిసార్లు నొప్పిని కూడా కలిగిస్తాయి. ప్రొటీన్లు కలిగిన ఆహారం తింటే కండరాలు శక్తిని పుంజుకుంటాయి.

ఏదో ఒక డైట్ మాత్రమే పాటించాలి

సాధారణంగా వెయిట్‌లాస్ అవ్వాలనుకునే వారు పాలియో డైట్, వేగన్‌డైట్, లో కార్బ్‌డైట్, డ్యూకెన్‌డైట్, అల్కా లో ఫ్యాట్ డైట్, అదికిన్స్‌డైట్, ఇంటర్ మిటెంట్ ఫాస్టింగ్ జోన్, హెచ్‌సీజీ తో పాటు కొన్ని రకాల ప్రొటీన్ డైట్లు పాటిస్తుంటారు. కానీ వీటిలో ఏదో ఒకదానిని మాత్రమే పాటించాలి. అలాగే రోజులో మూడుసార్లు తినే ఆహారాన్ని 5 నుంచి 6 సార్లు తీసుకునేలా చుసుకోవాలి. పిల్స్, ట్యాబెట్స్ ద్వారా బరువు తగ్గించే కొన్ని డైట్‌లు కూడా ఉన్నాయి. అటువంటి వాటికి దూరంగా ఉంటే మంచిది.

ప్రొటీన్ ఏయే పదార్థాల్లో ఉంటుంది

మొలకెత్తిన గింజలు, పొట్టు తీయని పదార్థాలుతో పాటు, చేప, గుడ్లు, చికెన్ వంటి పదార్థాలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. మనిషి సగటు బరువు ఎంత ఉందో అన్ని గ్రాములు ప్రొటీన్ తీసుకుంటే మంచిది, ఉదాహరణకు 50 కేజీలు ఉన్న మనిషి రోజుకు 50 గ్రాముల ప్రోటీన్ శరీరానికి అందేలా చూసుకోవాలి. అలాగే ఆహారాన్ని ఒకేసారి కాకుండా రోజులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. అంతేగాక ఒక రోజుకు మనిషికి 2000 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారం అవసరమవుతుంది అనుకుంటే, కేవలం 1500 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. మిగిలిన అవసరమైన క్యాలరీలను శరీరంలో ఉండే కొవ్వును కరిగించి శక్తిగా మారేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అవసరానికి మించి క్యాలరీలను తీసుకోంటే అది కొవ్వుగా మారిపోతుంది. అంతేగాక రోజులో చక్కెర పరిమాణం 4నుంచి 5 శాతం మాత్రమే తీసుకోవాలి.

తగ్గుతోంది ఏంటి ?

చాలా మంది రెండు వారాల వ్యాయామం, ఇతర చికిత్సల తరువాత 2-5 కేజీల బరువు తగ్గినట్టు కన్పిస్తారు. వాస్తవానికి ఇలా తగ్గేది కొవ్వు కాదు. శరీరంలో ఉన్న నీటిశాతం, మజిల్స్ కరగడం వల్ల ఇలా బరువు తగ్గినట్టు కన్పిస్తారు. డైట్ పాటించకుండా, వెయిట్‌లాస్‌లో సరైన విధానాలు పాటించని వారిలో ఇటువంటి లక్షణాలు కన్పిస్తాయి. ఇటువంటి విధానాలనే కొనసాగిస్తే శరీరంలో కొవ్వు అలానే ఉండి, కండరాలు కరిగి చర్మం లూజుగా మారిపోతుంది. నీటి శాతం తగ్గడం వల్ల స్పృహ తప్పడం, క్లోమ గ్రంధి పనిచేయకపోవడం వల్ల చక్కెర వ్యాధితో పాటు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంటుంది. కండరాలు బలహీనమై ఒకేసారీ పక్షవాతంకు దారీతీసే అవకాశం లేకపోలేదు.

వ్యాయామాలు చేయాలి ?

అధిక బరువుఉన్న చాలా మంది కార్డియో వర్కవుట్‌లు చేస్తూంటారు. కానీ దీనితో పాటుగా మజిల్స్ వర్క్‌వుట్ కూడా చేయాలి. అప్పుడే గుండెతో పాటు ఇతర అవయవాలు క్రియాశీలకంగా పనిచేస్తాయి. రోజులో 60 నిమిషాలు తప్పనిసరిగా వ్యాయమం చేయాలి. కండరాలకు వ్యాయామం చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. చేతులు, కాళ్లు, పొట్ట వర్క్ అవుట్‌లు చేసే సమయంలో విడి, విడిగా చేయాలి. అన్ని ఒకేసారీ చేయాలనుకుంటే మజిల్స్ స్ట్రక్ అయ్యే ప్రమాదముంటుంది. అలాగే నడకకు సంబంధించి 7నుంచి 10 వేలు అడుగులు తక్కువగాకుండా చూసుకోవాలి.

కొవ్వు శాతం ఎలా తెలుస్తుంది ?

ఎక్కువ మంది తమ బరువును తెలుసుకోనే ప్రయత్నం చేస్తూంటారు. కానీ అధిక బరువుతో బాధపడేవారు శరీరంలోని కొవ్వు శాతాన్ని మాత్రమే తెలుసుకోవాలి. బాడీ మాస్ ఇండెక్స్ అనే పరికరం ద్వారా దీనిని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇది అన్ని షాపింగ్ మాల్స్, ఆస్పత్రిల్లో అందుబాటులో ఉంది. శరీరంలో 28శాతం లోపు కొవ్వు ఉంటే సాధారణంగా ఉన్నట్టుగా పరిగణిస్తారు. 28-30 వరకు ఉంటే ఓవర్ వెయిట్ అని, 30 -35 ఉంటే ఓబెసిటీ అని, 35కంటే అధికంగా ఉంటే ఓవర్ ఓబెసీటి గా పరిగణిస్తారు.







80 శాతం డైట్.. 20 శాతం జిమ్

చందు, ఫిట్‌నెస్ ట్రైనర్, న్యూట్రిషియన్- గుంటూరు



జిమ్‌కు వస్తే బరువు తగ్గుతాము అనేది అపోహ మాత్రమే. జిమ్‌తో పాటు మంచి ఆహారం ముఖ్యం. 80శాతం ఆహార నియమాలు పాటిస్తేనే కొవ్వును తగ్గించుకోగలుతాం. మిగిలిన 20 శాతం వ్యాయామం చేస్తే సరిపోతుంది. ఈ మద్యకాలంలో పిల్లలు కూడా ఒబెసిటీ బారిన పడుతున్నారు. ఆహారంలో సమతుల్యత లేకపోవడమే దీనికి కారణం. అధిక బరువు ఉన్నవారు ప్రత్యేకమైన వ్యాయామాలను చేయాలి.

పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భువన, డైటీషియన్



కొవ్వు తగ్గించడానికి మార్కెట్‌లో లభ్యమయ్యే పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీటితో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. పౌడర్ల వాడే ముందు వైద్యులను సంప్రదించాలి. ఉదయాన్నే వెన్నతీసిన పాలు, పచ్చసొన తీసివేసిన గుడ్లు తీసుకోవాలి. గింజధాన్యాలు, పప్పుదినుసులు, చిక్కుడు గింజలు వంటి వాటిలో అధికంగా మాంసకృత్తులు ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. గింజధాన్యాలు పొట్టు తీసుకోకుండా తినాలి. వీటితో పాటు ఉడకబెట్టిన కూరగాయలు తీసుకోవాలి.

మామూళ్ళు.. ఓవర్ లోడ్

(5వ పేజీ తరువాయి)

టిప్పర్ల నుంచి రూ. 2 కోట్లకు పైగా అక్రమ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ బలవంతపు వసూళ్ల నుంచి ఎలా బయట పడాలో అర్థంకాక బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగినంతా చెల్లిస్తే కేసులుండవు ..

ఎవరైతే అడిగినంతా ఇవ్వకుంటే వెంటాడి మరీ కేసులు నమోదు చేస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.టిప్పర్‌కు అనుమతించిన వాహన బరువు 10టన్నులు కాగా దానిలో 18 టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చు. అందుకు భిన్నంగా ఆదునిక ఫీచర్లతో వచ్చిన లారీల బరువే 11 టన్నులకు పైగా ఉంటుంది. వాటిలో 30 నుంచి 35 టన్నుల వరకు ఇసుక.. కంకర వంటి మెటీరియల్‌ను రవాణా చేయగలుగుతున్నారు. రవాణాదారుల భద్రత దృష్ట్యా ఓవర్‌లోడ్ నిబంధనలు తెచ్చినా అవి అమలు కావడం లేదు. టిప్పర్లకు జీపీఎస్ సౌకర్యం ఉండడంతో, ముడుపులు ఇవ్వని టిప్పర్లు ఎక్కడ తిరుగుతున్నాయో తెలిసి పోతుండడంతో, ఆ వాహనాలను గుర్తించి కేసులు, జరిమానాలు విధిస్తున్నారని, తప్పనిసరి పరిస్థితిలో ముడుపులు సమర్పించుకుంటున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రిపేరుకు వచ్చినా, పనులు లేక కొన్ని రోజులు తిప్పకపోయినా అధికారులు కనికరించడం లేదని యాజమానులు వాపోతున్నారు.

మధ్యవర్తుల హవా..

రవాణా శాఖలో కొందరు చేస్తున్న అక్రమ వసూళ్లలో మధ్యవర్తుల హవా కొనసాగుతోంది. ప్రతి నెల 5వ తేదీ లోపు ముడుపులు చెల్లించాల్సిందే. లేదంటే వెంటనే కేసులు నమోదు అవుతాయి. తమ వద్ద పనిచేస్తున్న కానిస్టేబుళ్ళను పురమాయించి, టిప్పర్ యాజమానులలో ఇద్దరు ముగ్గరిని ఎంపిక చేసుకొని వారి ద్వారా మిగతా వారి నుంచి నెలవారీ ముడుపులు వసూలు చేస్తున్నారని తెలిసింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో బరితెగించిన కొందరు అధికారులే, కూటమి ప్రభుత్వంలోనూ వసూళ్ళ వ్యవహారం చక్కబెడుతున్నారని లారీల యాజమానులు వివరిస్తున్నారు.

సూర్యలంక తీరంలో బీచ్ వాలీబాల్ పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలు యువతలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ అంతర్‌జిల్లాల బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ బంతిని సర్వీస్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పాయపాలెం పాఠశాల విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శరీర ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. యువత ఆరోగ్యం మెరుగు పడటంతోపాటు, క్రీడా నైపుణ్యాలను మెరుగు దిద్దుకోవటానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. టీమ్‌గా పనిచేయటానికి స్ఫూర్తిని నింపుతాయన్నారు. సముద్ర తీరం వెంబడి మంచి ఏర్పాట్లతో పోటీలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. పోటీలలో పాల్గొనేందుకు 13జిల్లాలు నుంచి క్రీడాకారులు రావటం జరిగిందన్నారు. కార్తీకమాసంలో ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయటం శుభపరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించటం సంతోషదాయకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. అన్నిజిల్లాల క్రీడాకారులు బాపట్లకు వచ్చి బీచ్‌వాలీబాల్ పోటీలలో పాల్గొనటం మంచి పరిణామమన్నారు.సూర్యలంక బీచ్‌ని పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాద్యతగా భావించాలన్నారు. కార్తీక మాసంలో సూర్యలంక బీచ్‌లో లక్షల మంది ప్రజలు స్నానాలు ఆచరించటం, పూజలు చేయటం జరుగుతుందన్నారు. గెలుపు, ఓటమీలను ఒకేలాగా స్వీకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం చెప్పారు. ఓటమ పాలైన వారు చాలెంజ్‌గా తీసుకొని మరోమారు గెలుపునకు కృషి చేయాలన్నారు. విజేతలైనవారు ఒడిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని బహుమతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా స్పోర్ట్స్ అధారిటీ చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి, షేక్.కరీముల్లా, టీడీపీ మహిళా నాయకులు కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, ఎంఇవో డి.ప్రసాదరావు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

ఆమె.. ఆదర్శం

- తన పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చేర్పించిన ఉపాధ్యాయురాలు
- అభినందించిన రెడ్డిగూడెం గ్రామస్థులు, అధికారులు



ఉపాధ్యాయురాలు సుజాతలక్ష్మీని శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్థులు, అధికారులు

రాజుపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంపన్నులు, ఆర్థికంగా కాస్త ఇబ్బందికరంగా లేని వారు ఎవరూ కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు ముందుకు రాకపోవటం చూస్తున్నాం. దాదాపుగా ప్రభుత్వ ఉద్యోగులందరూ ఇదే కోవకు చెందిన వారే. కానీ వీరందరికీ భిన్నంగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆమె పిల్లలను ఆమె విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. ఇలా ఇతరుల పిల్లలతో పాటు ఆమె పిల్లలకి తానే విద్యాబుద్ధులు చెబుతూ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులుగా నిలిచారు.

వివరాలలోకి వెళితే.. రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బిట్రా సుజాతలక్ష్మీ అనే ఉపాధ్యాయురాలు నాలుగు సంవత్సరాల నుంచి విద్యాబోధన చేస్తున్నారు. అదే పాఠశాలలో రెండు సంవత్సరాల క్రితం తన పెద్ద కుమార్తె విశ్వజ్ఞను నాలుగవ తరగతిలో చేర్పించింది. రెండవ కుమార్తె కృష్ణజను ఒకటవ తరగతిలో చేర్పించింది. ఆరోజు నుంచి నేటి వరకు సుజాతలక్ష్మీ తన ఇద్దరి పిల్లలను తీసుకుని పాఠశాలకు వస్తుంది. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ పది నిమిషాల ముందే పాఠశాలకు చేరుకుంటుంది. ఈ విషయం గమనించిన గ్రామస్థులు భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం రోజున ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో మల్లికార్జున శర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), షేక్ అల్లాబక్షు తదితరులు ఉపాధ్యాయురాలును అభినందించారు. ఈ సందర్భంగా సుజాతలక్ష్మీ మాట్లాడుతూ 'నా పిల్లలు కూడా ఇక్కడ చదువుకోవటం వలన ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం ఉంది. దాంతో నేను సాయంత్రం ఇంటికి ప్రశాంతంగా, సంతృప్తికరంగా వెళ్తున్నాను' అని చెప్పటంతో అక్కడ ఉన్న వారంతా ఆమెను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పోటీతత్వం కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది

- వీసీ ఆచార్య గంగాధరరావు
- ఏఎన్‌యూలో ప్రారంభమైన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కే గంగాధర్

పెదకాకాని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పోటీ తత్వంకన్నా క్రీడ స్ఫూర్తి ఎంతో గొప్పదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో సౌత్- వెస్ట్ జోన్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రీడలకు ఉన్న ప్రాధాన్యత మరే రంగంలో కూడా ఉండదని అన్నారు. దేశ భవిష్యత్తును, వ్యక్తిగత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని, అదే వారిని విజేతలుగా నిలుపుతుందని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడలకు పుట్టి నిల్లుగా నిలుస్తోందని, ఇటువంటి ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలను ఆస్వాదిస్తూ క్రీడాకారులు మంచి ప్రదర్శనలు ఇవ్వాలని అన్నారు. రెక్టర్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ,శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం మాట్లాడుతూ మహిళలు వెయిట్ లిఫ్టింగ్ లో రాణించడం గొప్ప విషయమని అన్నారు. వారిని ప్రోత్సహిస్తున్న వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియ జేశారు. భవిష్యత్తులో కూడా అనుకున్న లక్ష్యాలు సాధించాలని సూచిం చారు. క్రీడల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఈ క్రీడల్లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రతిభ ఉన్న వారికే పథకాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం తొలి రోజు పోటీలలో పతకాలు సాధించిన మహిళా వెయిట్ లిఫ్టర్లకు మెడల్స్ ను అందజేశారు. ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య టెక్నికల్ కమిటీకి చీఫ్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో వ్యాయామ కళా శాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీ జాన్సన్, అధ్యాపకులు డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ డీసూర్యనారాయణ పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో క్రీడాకారిణుల ప్రదర్శన

మహిళా విభాగంలో తొలి రోజు ఫలితాలు

సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ మహిళల విభాగం 45 కేజీల విభాగంలో శివాజీ యూనివర్సిటీ (కొల్హాపూర్) క్రీడాకారిణి సర్గార్ కాజోల్ మహదేవ్ బంగారు పతకం, మంగళూరు యూనివర్సిటీకి చెందిన స్పందన వెండి పతకం, యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఆర్. గోగోయి కాంస్యపతకం సాధించారు. 49 కేజీల విభాగంలో.. ముంబై యూనివర్సిటీకి చెందిన సౌమ్య దాల్వి బంగారు పతకం, గుజరాత్ లోని జైన్ యూనివర్సిటీ క్రీడాకారిని తోక్చోం సంజు దేవి వెండి పతకం, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ క్రీడాకారిణి ఎన్.అను కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. 55 కేజీల విభాగంలో.. శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ క్రీడాకారిణి దూబా హేమశ్రీ బంగారు పతకం పొందగా గుజరాత్ లోని మార్వాడి యూనివర్సిటీ క్రీడాకారిని శర్మ విద్య వెండి పతకం, శివాజీ యూనివర్సిటీ కి చెందిన క్రీడాకారిని కమలాకర్ నికిత సునీల్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

పోటీలలో ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

చీరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ్ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు ఉర్దూ హైస్కూల్లో నిర్వహించిన పోటీలలో చీరాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పలు పోటీలలో విజేతలుగా నిలిచారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను మంగళవారం మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జె.సరళ, ఉపాధ్యాయులు అభినందించారు. పాటల పోటీలలో కె.మనస్విని (ప్రథమ), క్విజ్ పోటీలో పీవీఎన్ఎస్ సంతోష్ (ప్రథమ), డిబేట్‌లో ఏ.అభిషేక్, ఆర్.అభిషేక్ రెండో స్థానంలో నిలిచారన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో ఈ జోనల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. స్కూల్ తరపున ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితుల హక్కులకు భంగం కలిగించొద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

మేదరమెట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల హక్కులకు భంగం కలిగించవద్దని, వారు ఆత్మస్థైర్యం కోల్పోయే విధంగా ప్రవర్తించకూడదని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం, డిసెంబరు 1 అంతర్జాతీయ హెచ్ఐవీ నివారణ దినం సందర్భంగా హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ చట్టం-2017పై కొరిశపాడు మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులకు, సహాయకులకు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ బీవీ సాగర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా డిసెంబరు 1న అంతర్జాతీయ హెచ్ఐవీ దినం సందర్భంగా అవగాహన ర్యాలీలు, నవంబరు 29న గ్రామాలల్లో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కలిసి ముగ్గుల పోటీలు, చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని 30వ తేదీన క్యాండిల్ లైట్స్ ర్యాలీ నిర్వహించాలని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన అద్దంకి కోర్టు ఏజీపీ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ బాధితులు సమాజంలో కలిసి మెలిసి జీవించే విధంగా చూడాలన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, క్రీడల్లోనూ వారి పట్ల వివక్ష చూపడం నేరమని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అనిల్, కె.దుర్గ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులతో దేశ అభివృద్ధి


సంచులను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

చీరాలటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడం వలన దేశాభివృద్ధి సాధ్యపడుతుందని రాఘవేంద్ర స్కూల్ డైరక్టర్ గవిని మణికుమార్ అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఏఆర్ఎం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పవని భానుచంద్రమూర్తికి స్కూల్ ప్రాంగణంలో అభినందన సభను నిర్వహించారు. ఈసందర్భంగా భాను సేవలను కొనియాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వస్త్ర సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలి

దర్శి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన జాతీయస్థాయి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల సదస్సులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రం తరపున ఈ సదస్సులో పాల్గొనే అవకాశం పిచ్చయ్యకు లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు అధిక నిధులు కేటాయించి పట్టణాల్లో వసతులు కల్పించేందుకు సహకరించాలని కోరారు.

మామూళ్లు .. ఓవర్ లోడ్

(5వ పేజీ తరువాయి)

టిప్పర్ల నుంచి రూ. 2 కోట్లకు పైగా అక్రమ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ బలవంతపు వసూళ్ల నుంచి ఎలా బయట పడాలో అర్థంకాక బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగినంతా చెల్లిస్తే కేసులుండవు

ఎవరైతే అడిగినంతా ఇవ్వకుంటే వెంటాడి మరీ కేసులు నమోదు చేస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.టిప్పర్‌కు అనుమతించిన వాహన బరువు 10టన్నులు కాగా దానిలో 18 టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చు. అందుకు భిన్నంగా ఆధునిక ఫీచర్లతో వచ్చిన లారీల బరువే 11 టన్నులకు పైగా ఉంటుంది. వాటిలో 30 నుంచి 35 టన్నుల వరకు ఇసుక.. కంకర వంటి మెటీరియల్‌ను రవాణా చేయగలుగుతున్నారు. రహదారుల భద్రత దృష్ట్యా ఓవర్‌లోడ్ నిబంధనలు తెచ్చినా అవి అమలు కావడం లేదు. టిప్పర్లకు ఉన్న జీపీఎస్ సౌకర్యం ఉండడంతో, ముడుపులు ఇవ్వని టిప్పర్లు ఎక్కడ తిరుగుతున్నాయో తెలిసి పోతుండడంతో, ఆవాహనాలను గుర్తించి కేసులు, జరిమానాలు విధిస్తున్నారని, తప్పనిసరి పరిస్థితిలో ముడుపులు సమర్పించుకుంటున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రిపేరుకు వచ్చినా, పనులు లేక కొన్ని రోజులు తిప్పకపోయినా అధికారులు కనికరించడం లేదని యాజమానులు వాపోతున్నారు.

మధ్యవర్తుల హవా

రవాణా శాఖలో కొందరు చేస్తున్న అక్రమ వసూళ్లలో మధ్యవర్తుల హవా కొనసాగుతోంది. ప్రతి నెల 5వ తేదీ లోపు ముడుపులు చెల్లించాల్సిందే. లేదంటే వెంటనే కేసులు నమోదు అవుతాయి. తమ వద్ద పనిచేస్తున్న కానిస్టేబుళ్లను పురమాయించి, టిప్పర్ యాజమానులలో ఇద్దరు ముగ్గురిని ఎంపిక చేసుకొని వారి ద్వారా మిగతా వారి నుంచి నెలవారీ ముడుపులు వసూలు చేస్తున్నారని తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బరితెగించిన కొందరు అధికారులే, కూటమి ప్రభుత్వంలోనూ వసూళ్ల వ్యవహారం చక్కబెడుతున్నారని లారీల యాజమానులు వివరిస్తున్నారు.

ఇది కదా భరోసా!

- ఒకరోజు ముందే చేతికి పింఛన్
- ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఈనెల 30నే పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ముందుగా ఇవ్వడం ఇది రెండోసారి

ఒంగోలు నగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఒకరోజు ముందే అందజేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే సెప్టెంబరు మాసంలో ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఆగస్టు 31నే పింఛన్లను పంపిణీ అధికార యంత్రాంగం చేసింది. ఇప్పుడు డిసెంబరు 1 ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఈనెల 30వ తేదీనే పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు 30వ తేదీనే జిల్లా అంతటా పింఛన్ల పంపిణీ చేసేందుకు అంతా సిద్ధం చేశారు. ఈనెల 29వతేదీనే బ్యాంకుల నుంచి సచివాలయం సిబ్బంది పింఛన్ల సొమ్మును డ్రా చేయనున్నారు. ఆ తర్వాత శనివారం వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టనున్నారు.

పింఛన్‌దారులకు ఊరట

జిల్లాలో గత నెలలో 2,87,127 మంది పింఛన్ పొందే లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 966 మంది మరణించారు. వీరు పోను మిగిలిన అందరికీ ప్రభుత్వం పింఛన్‌ను సొమ్మును అందజేయనుంది. వైసీపీ పాలనలో రంచన్‌గా వృద్ధులకు ఏనాడూ పింఛన్ అందిన దాఖలాలు లేవు. నెలలో ఒకటో తేదీ సెలవు అయితే ఆ మరుసటి రోజే లేదా వారం తర్వాతో పంపిణీ చేసేవారు. ఆ నెలలో తీసుకుంటేనే పింఛన్ లేదంటే ఆ నెల సొమ్మును లబ్ధిదారుడు ఇ క మరిచిపోవాల్సిందే. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పింఛన్‌దారులకు బో లెడంత ఊరట లభించింది. ప్రతినెలా మొదటి తారీఖున పింఛన్ సొమ్ము చేతికి అందుతోంది. ఒకటో తేదీ సెలవు అయితే ముందే రోజే ఇస్తున్నారు. ఒక నెలలో తీసుకోకపోతే రెండో నెలలో, రెండు నెలలు తీసుకోకపోతే మూడో నెలలో మూడు నెలలకు కలిపి లబ్ధిని అందజేసే అవకాశం కల్పించింది కూటమి ప్రభుత్వం.



కూటమి ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులకు భరోసా లభించింది. ప్రతినెలా ఒకటో తేదీనే రంచన్‌గా పింఛన్ సొమ్ము చేతిలో పడుతోంది. తొలిరోజే 90శాతం మంది లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి సచివాలయ సిబ్బంది ఆ మొత్తాన్ని అందజేస్తున్నారు. ఒకటో తేదీ సెలవు దినం అయితే ఒకరోజు ముందుగానే ఇస్తున్నారు. డిసెంబర్ 1వతేదీ కూడా ఆదివారం కావడంతో ఒకరోజు ముందే శనివారం పింఛన్‌లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సచివాలయ సిబ్బంది కూడా సిద్ధమవుతున్నారు

1,283 మందికి రెండు నెలలకు కలిపి పింఛన్

నవంబరు ఒకటో తేదీన ప్రభుత్వం జిల్లాలో పింఛన్లను పంపిణీ చేసింది. జిల్లాలో మొత్తం 2,87,127 మంది వివిధ రకాల పింఛన్లు తీసుకుంటున్నారు. వీరికి నవంబరు మాసంలో పింఛన్లను అందజేయగా వీరిలో 966 మంది చనిపోయారు. 1,283 మంది నవంబరులో పింఛన్ సొమ్మును వివిధ కారణాలతో తీసుకోలేకపోయారు. ఈ 1,283 మంది ఈనెల 30వ తేదీన పింఛన్ల పంపిణీ సమయంలో రెండు నెలలకు కలిపి పింఛన్ సొమ్మును ప్రభుత్వం అందజేయనుంది.

అన్ని చర్యలు చేపట్టాం

డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30వతేదీనే చేపట్టనున్నాం. శనివారం పంపిణీని ప్రారంభించి మిగిలిన వారికి డిసెంబరు 2వతేదీన అందజేస్తాం. సచివాలయ సిబ్బంది ఈనెలాఖరులోనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందజేయనున్నారు. ఒక రోజు ముందే అందజేసే పింఛన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

- వసుంధర, డీఆర్‌డీఏ పీడీ

పొంచి ఉన్న తుఫాన్ ముప్పు

- బంగాళాఖాతంలో ఇప్పటికే తీవ్రవాయుగుండం
- జిల్లావ్యాప్తంగా మారిన వాతావరణం
- చలిగాలులు, రెండు రోజుల తర్వాత భారీ వర్షాలకు అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు


నగరంలో మంగళవారం మారిన వాతావరణం

ఒంగోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు తుఫాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా మారింది. రెండు రోజుల్లో తుఫాన్‌గా మారనుంది. వాయుగుండం ప్రభావం అటు శ్రీలంకపైనా ఇటు తమిళనాడులోని చెన్నై ఉత్తర ప్రాంతంపైన తీవ్రంగా చూపనుంది. ఇప్పటికే శ్రీలంక ప్రాంతం దాటి తిరిగి సముద్రంలోకి వచ్చి మరోసారి చెన్నై దక్షిణ ప్రాంతంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. చెన్నై దక్షిణ ప్రాంతంలో తీరం దాటే సమయంలో ఆ ప్రభావం జిల్లాపై కనిపించనుంది. దీని వల్ల జిల్లావ్యాప్తంగా ఈనెల 29 నుంచి వచ్చేనెల 1 వరకు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి వాతావరణ శాఖ నుంచి సమాచారం అందింది. ఒకవేళ ఈ రెండు రోజుల్లో తుఫాన్ దిశ మారిన లేదా చెన్నై దక్షిణ ప్రాతంలో తీరం దాటే సమయానికి బలంగా ఉన్న జిల్లాపై తుఫాన్ ప్రభావం మరింత అధికంగానే ఉండే అవకాశం ఉంది.

మొదలైన ప్రభావం

కాగా జిల్లాలో ఇప్పటికే తుఫాన్ ప్రభావం కనిపిస్తోంది. వర్షాలు లేకపోయినప్పటికి వాతావరణంలో భారీ మార్పు వచ్చింది. మంగళవారం పగటిపూట తూర్పు ప్రాంతంలో ఎండ కనిపించలేదు. ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరిగింది. ఒంగోలులో మంగళవారం 28.9 డిగ్రీలు గరిష్ఠ, 23.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు నాలుగు డిగ్రీలు పడిపోయాయి. కొన్నిచోట్ల మంచు కూడా పడింది. ఇదిలావుండగా రానున్న రెండు రోజులు ఇదే తరహా వాతావరణం జిల్లాలో కొనసాగి అనంతరం ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా రబీ పనులు సాగుతుండగా భారీ వర్షాలు కురిస్తే నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పొగ తోటల్లో సేద్యం చేయడం, నాట్లు వేయడం తాత్కాలికంగా నిలిపివేయడం మంచిదని నిపుణులు చెప్తున్నారు.

నగరంలో గ'లీజు'పై కదలిన యంత్రాంగం

షాపుల నిర్వహణపై విచారణ చేపట్టిన అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొత్త మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో గలీజు' వ్యవహారంపై కార్పొరేషన్ అధికారులు కదిలారు. ఎవరు నిర్వహిస్తున్నారని విచారణ చేపట్టారు. మునిసిపల్ కాంప్లెక్స్‌లలో అదే 'గలీజు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు స్పందించారు. ఈ మేరకు నగరంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో బినామీల గుర్తింపు, తొలగింపుపై రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గత కొన్నేళ్లుగా కార్పొరేషన్ షాపుల్లో తిష్టవేసి, అద్దెలు చెల్లించని వారిపై చర్యలకు సిద్ధమయ్యారు. రెవెన్యూ యంత్రాంగం రెండు బృందాలుగా కార్పొరేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. లీజుదారులు ఎవరు? అద్దెకు ఉంటున్న వారు ఎవరు? అనే దానిపై విచారణ ప్రారంభించారు. కార్పొరేషన్‌కు చెల్లిస్తున్న అద్దె ఎంత, వసూలు చేస్తుంది ఎంత, ఎంత బకాయి ఉందనే వివరాలు సేకరించారు. విచారణ పూర్తయిన తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఒకవైపు లీజుదారులు, మరోవైపు అద్దెకు ఉంటున్న వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది.

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి


మిరపను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వేటపాలెం(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన పైర్లకు ముందస్తుగా చేసిన భూసార పరీక్షల మేరకు అవసరమైన ఎరువు లు వాడాలని ఏవో కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. దేశాయిపేట-3, పాపాయిపాలెం రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. మితిమీరి ఎరువులు, పురుగు మందుల వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. ధాన్యం సాధారణ రకం క్వింటా రూ.2300, ఏడ్ ఏ రకం క్వింటా రూ.2320కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో జశ్వంత్, వీఏఏలు వినయ్‌కుమార్, రుఫియా, మనీషా పాల్గొన్నారు.

చీరాలటౌన్ : చీరాల మండలపరిధిలో వరి సాగు చేస్తున్న రైతులు బీమా చేసుకోవాలని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. మంగళవారం దేవాంగపురి, సాల్మన్‌సెంటర్ గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎహెచ్ఏ రమేష్, బీటీఎం జ్యోతి, వీఏఏలు రమ్య, లావణ్య, బాషెబా, సాయి పాల్గొన్నారు.

ఇంకొల్లు : రబీలో వేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. దుద్దుకూరు, వం కాయలపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగకు ఎకరాకు రూ.84, వరికి రూ.126, మొక్కజొన్నకు రూ. 105, మినుముకు రూ.60, పెసరకు రూ.30, జొన్నకు రూ.38 ఎకరాకు ప్రీమియం చెల్లించాలన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరపను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, మురకొండ సుబ్బారావు, వీఆర్వో పరశురామిరెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది ప్రియ, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : డిసెంబర్ 15లోగా పంటల బీమాను చెల్లించాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోందిలో భాగంగా పంటలను పరిశీలించారు. వాయుగుండం కారణంగా పగలు ఉష్ణోగ్రతలు తగ్గడం వలన వరిలో దోమపోటు, అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్.దీప్తి, వీఏఏ శేషయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక, సయింపు సురేష్, రాయుడు, నరేంద్ర పాల్గొన్నారు.

పర్చూరు : రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. మండలంలోని కొమర్నేనివారిపాలెం, నాగులపాలెం గ్రామాల్లో మంగళవారం ఏవో రామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొమర్నేనివారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రబీలో వైట్‌బర్లీ పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, మొక్కజొన్న సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కట్నం తీసుకున్నా.. ఇచ్చినా కఠిన శిక్షలు

కనిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కట్నం తీసుకున్నా, ఇచ్చినా నేరం కింద పరిగణించి కఠిన శిక్షలు పడతాయని కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. భారతరాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణ సమీపంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం అందించటమే భారత రాజ్యాంగం లక్ష్యమన్నారు. న్యాయాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. కట్నం ఇవ్వబోమని బాలికలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎస్ఐ శ్రీరాం, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైల్వే మంత్రికి ఎంపీ వినతి


కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు వినతిని అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను మంగళవారం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కలిసి, పలు అంశాలపై వినతిపత్రం అందజేశారని ఎంపీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. వందేభారత్ రైలు కు చీరాల స్టాపింగ్ ఇవ్వాలని, విజయవాడ, గూడురు మధ్య నాలుగవ లైన్ నిర్మాణం, రేపల్లె, తెనాలి మధ్య రెండవ లైన్ నిర్మాణం, రేపల్లె, బాపట్ల మధ్య కొత్త లైన్ నిర్మాణం చేపట్టాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నట్లు కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

తొమ్మిది గ్రానైట్ లారీలు సీజ్

ఒంగోలుక్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తనిఖీలలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది గ్రానైట్ లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి టి.రాజశేఖర్ తెలిపారు. శని, ఆదివారాలలో మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించామన్నారు. ఒంగోలు నగరం శివారు ప్రాంతంలో మూడు గ్రానైట్ శ్లాబులు ఉన్న లారీలు చెన్నై పోర్టుకు తరలిస్తుండగా సీజ్ చేసి ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్టామన్నారు. చీమకుర్తి గ్రానైట్ క్వారీల నుంచి పాలిషింగ్ యూనిట్లకు తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసి చీమకుర్తి ఏపీఎండీసీ కాంపౌండ్‌కు తరలించారు. మరో మూడు లారీలు గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు తరలిస్తుండగా సీజ్ చేసి మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో పెట్టామని తెలిపారు. ఈ దాడులలో గనుల శాఖ ఏడీ బి.రామచంద్ర, ఏజీ రవివర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు మళ్లీ నోటీసులు


ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు నోటీసులు ఇస్తున్న ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో నిబంధనలు పాటించకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారనే ఆరోపణలపై అప్పటి అధికారుల ఫిర్యాదు మేరకు ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అందుకు సంబంధించిన 41ఏ నోటీసులను మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో పెద్దారవీడు ఎస్సై పి.అనిల్ కుమార్ అందజేశారు. ఇప్పటికే ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులు నమోదు కాగా పెద్దారవీడు మండలంలోని నమోదైన కేసుతో మొత్తం 6 కేసులు ఆయనపై నమోదయ్యాయి.

గొంతుకు టవల్ బిగించి.. కత్తితో పొడిచి!

- టంగుటూరులో వివాహిత దారుణ హత్య
- ఇంటికి తాళం వేసి వెళ్లిన దుండగులు

టంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టంగుటూరులో వివాహిత దారుణ హత్యకు గురైంది. దుండగులు ఆమె గొంతుకు టవల్ బిగించి, కత్తితో పొడిచి చంపారు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బొడ్డపాటి హైమావతి (40), పెదరంగారెడ్డి దంపతులు స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దమ్మాయికి వివాహమైంది. రెండో కుమార్తె ఒంగోలులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. పెదరంగారెడ్డి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో తిరుపతి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయల్దేరారు. సోమవారం ఉదయం భార్యకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. వెంటనే టంగుటూరులోనే నివాసం ఉండే తన తమ్ముడికి ఫోన్ చేశారు. ఇంటికెళ్లి మీవదిన చేత ఫోన్ చేయించమని చెప్పారు. దీంతో చిన్నరంగారెడ్డి ఇంటికెళ్లి చూడగా తాళం వేసి ఉంది. హైమావతి ఎక్కడికైనా వెళ్లి ఉంటుందనుకొని ఇదేవిషయాన్ని అన్నయ్యకు చెప్పారు. తన ఫోన్‌కు భార్య నుంచి రోజంతా సమాధానం లేకపోవడంతో కంగారుపడిన రంగారెడ్డి మంగళవారం పెద్దకుమార్తెకు సమాచారం ఇచ్చారు. ఆమె భర్తను వెంటబెట్టుకొని టంగుటూరు చేరుకుంది. ఇంటి బయట హైమావతి చెప్పులు ఉండటంతో అనుమానంతో తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది.

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

సమాచారం అందుకున్న టంగుటూరు పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. హైమావతి మృతదేహాన్ని పరిశీలించారు. గొంతుపైన కత్తిపోట్లు, ఎడమ మణికట్టుపై కత్తి గాయం కనిపించాయి. మెడలో టవల్ ఉంది. దీంతో దుండగలు గొంతుకు టవల్ బిగించి కత్తితో పొడిచి చంపి ఉంటారని అనుమానిస్తున్నారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. డాగ్ ఆ పరిసరాల్లోనే తిరగడం కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేశారు. హైమావతిని హత్య చేసింది ఎవరు? అందుకు కారణం ఏమిటి? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. తొలుత కాల్‌డేటాను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఒంగోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. విభిన్న వర్గాలు, రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, వివిధ ప్రజాసంఘాల వారు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతరచోట్ల రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞలు చేశారు. ఈసారి వజ్రోత్సవం కావడంతో మరింత ఘనంగా నిర్వహించారు.

డాక్టర్ లేరు..మందులు దొరకవు



గంగమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపై పడిపోయిన గ్రానైట్ ముడిరాళ్లు

రోడ్డుపై పడిన గ్రానైట్ ముడిరాళ్లు

- తప్పిన ప్రమాదం
- ఒకే లారీపై రెండు రాళ్ల తరలింపుతోనే ప్రమాదం

బల్లికురవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ రాయిని రవాణా చేసే సమయంలో తగిన జాగ్రత్తలు చేపట్టకపోవడంతో రోడ్డుపై లారీ పై నుంచి రెండు పెద్ద రాళ్లు కింద పడిపోయాయి. అ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సంతమాగులూరు మండలం గురిజేపల్లి నుంచి బల్లికురవ వైపు వస్తున్న ట్రాలీ లారీపై సోమవారం రాత్రి రెండు బండ రాళ్లను తీసుకు వస్తుండగా ఒకేషనల్ శిక్షణ కేంద్రం భవనం వద్దకు వచ్చే సరికి లారీ అదుపు తప్పి లారీ మార్జిన్‌లోకి పోవడంతో రెండు రాళ్లు కింద పడిపోయాయి. లారీ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. మలుపు కావడంవల్లే ప్రమాదం జరిగి ఉంటుందని బాటసారులు తెలిపారు. రెండు రాళ్లు ఒకే మారు రవాణా చేయడం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని వారు తెలిపారు. పరిమితికి మించి గ్రానైట్ ముడి రాయి రవా ణా చేస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని ప్రతి రోజు ఏదో ఒక రోడ్డులో రాళ్లు పడిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- అరకొర సిబ్బంది
- పశువుల ఆసుపత్రుల్లో దుస్థితి
- ఇబ్బంది పడుతున్న పోషకులు

పర్చూరు, నవంబరు 26 : పశు వైద్యశాలలకు గ్రహణం పట్టింది. ఆసుపత్రికి సిబ్బంది, మందుల కొరత, అరకొర వసతులతో పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు మందుల దుకాణాలకు వెళ్లి కొనుక్కోవల్సిన పరిస్థితి వస్తుందని పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు సబ్ డివిజన్ పరిధిలో ఏ పశువుల ఆసుపత్రికి వెళ్లినా ఇదే పరిస్థితి కన్పిస్తుంది. కనీసం వైద్యుడు కూడా లేకపోవడం దారుణం. ఏడాదిగా మందులు లేక ఇబ్బంది పడుతున్నామని పోషకులు వాపోతున్నారు. పశు పోషకులను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ ప్రకటన ఆసుపత్రులు, వాటికి సంబంధించిన పథకాల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకుంటోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారంగా మారిన పశు పోషణ

ప్రస్తుత పరిస్థితుల్లో పశు పోషణ భారంగా మారింది. గ్రాసం దొరక్క, రూ.వేలకువేలు పెట్టి కొనలేక పోషకులు అవస్థలు పడుతున్నారు. ఇది చాలక పశువుల ఆసుపత్రిలో సరైన వైద్యం, మందులు దొరక్క ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని పోషకులు అంటున్నారు.

ఇన్‌చార్జి వైద్యులే దిక్కు

పశువుల ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఎక్కడ చూసినా ఇన్‌చార్జి వైద్యులే దిక్కవుతున్నారు. వారు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియక పోషకులు ఇబ్బంది పడుతున్నారు. పశువులను ఆసుపత్రికి తీసుకువచ్చి, డాక్టర్ లేరంటే వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వస్తోందని చెప్తున్నారు. నూతలపాడులో వైద్యుడు లేక ఇన్‌చార్జి వైద్యుడి పై ఆధారపడాల్సి వస్తోంది. కారంచేడు మండలం స్వర్ణలో వైద్యుడు లేక వీఏలతో సరిపెట్టుకుంటున్నారు.



నూతలపాడు పశువుల ఆసుపత్రిలో డాక్టర్ లేక వైద్యం అందిస్తున్న ఒప్పంద ఉద్యోగులు

పశు పోషణ భారం



పశు పోషణ భారంగా మారింది. ఒక పక్క పశు గ్రాసం అందక మరో ప్రక్క పశువులకు జబ్బు చేస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు దొరక్క ప్రైవేటుగా వేలకువేలు ఖర్చు చేస్తున్నాం. దీంతో పశువులను పెంచాలంటేనే భయమేస్తుంది.

- అవిశెట్టి హనుమంతురావు, నూతలపాడు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



మాకు ఐదు పశువులు ఉన్నాయి. వాటి ఆధారంగానే జీవిస్తున్నాం. ప్రస్తుతం వాటి పోషణ భా రంగా మారింది. గ్రాసం ధర బాగా పెరిగింది. ఆసుపత్రిలో వైద్యుడి కొరత, మందులు లేక ప్రైవేటుగా కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారింది. ప్రభు త్వం చర్యలు తీసుకోవాలి.

- ఉజిని చిన్నబాబు, నూతలపాడు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ జీవీ చౌదరి

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

బల్లికురవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి తల్లి దండ్రులు పెట్టుకొన్న నమ్మకాన్ని నిలబెట్టు కోవాలంటే ఇష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్‌ఐ జీవీ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందుతుందన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయాలని చూస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చేసిన ప్రోత్సహించిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు నాగినేని సాంబశివరావు, దమ్ము అంజయ్య, మక్కెన రామారావు పాల్గొన్నారు.

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

పంగులూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం రెండు గంటలపాటు కరెంట్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

సర్వీసు రోడ్డు పక్కన కాల్వలు నిర్మించండి



అండరుపాస్ వద్ద పరిశీలిస్తున్న హైవే అధికారులు

మార్టూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు సెంటర్లో తూర్పు వైపున సర్వీసు రోడ్డు పక్కన సైడు కాల్వలను నిర్మించాలని హైవే అధికారులను టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం హైవే అధికారులు మార్టూరులో పెద్ద అండర్ పాస్ వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో హైవే అధికారులు మాట్లాడారు. దాంతో నాయకులు వర్షాలు కురిసినపుడు పెద్ద అండర్ పాస్ వద్ద ఇరువైపులా భారీగా వర్షపు నీళ్లు నిలబడిపోతున్నాయని, సర్వీసు రోడ్డు పక్కన కాల్వల నుంచి నీళ్లు సక్రమంగా వెళ్లడంలేదని, తదితర సమస్యలను పరిష్కరించాలని హైవే అధికారులను అడిగారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు లిఖిత పూర్వకంగా అందజేయాలని వారు నాయకులను కోరారు. అంతేగాకుండా పబ్లిక్ టాయ్‌లెట్లు నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, గొట్టిపాటి వెంకట్రావు, మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా, మువ్వా సాంబయ్య పాల్గొన్నారు.

రాగి వైరు చోరీపై కేసు

బల్లికురవ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామ పోలాల్లో ఈ నెల 4వ తేదీన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి వైరును గుర్తు తెలియని దొంగలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జీవీ చౌదరి తెలిపారు. వల్లాపల్లి గ్రామంలో ఉన్న పంట పొలంలో ఏర్పాటు చేసిన 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని వైరును తస్కరించారు. ఏఈ శ్రీనివాసరావుకు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం దుకాణాల్లో అధికారుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణదారులు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీహరి మంగళవారం చీరాల, వేటపాలెం మండలపరిధిలోని పలు వైన్ షాపుల్లో తనిఖీలు చేశారు. రికార్డులు, మద్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా చేస్తున్న హరిప్రసాద్ నగర్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయాలపై చర్యలు

వేటపాలెం(చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం విక్రయాలను అక్రమంగా జరిపితే చర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. రామన్నపేట కొత్త కాలువ బ్రిడ్జి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమచా రం మేరకు ఎస్సై సిబ్బందితో కలసి శ్రీకాంత్ అనే వ్యక్తిని అదుపులోని, 8 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మద్యం సీసాలు, నిందితునితో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

ఘనంగా భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం

అంబేడ్కర్‌కు పలువురి నివాళి



అమరావతిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి



ఇడుపులపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అద్దంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమరావతిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం చం ద్ర బాబునాయుడుతో కలిసి విద్యుత్ శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. పట్టణంలోని బంగ్లా రోడ్డులో అంబేడ్క ర్ విగ్రహానికి టీడీపీ నేతలు సందిరెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, కోటయ్య, చుండూరి మురళీ సుధాకర్ నివాళులర్పించారు.

అద్దంకిటౌన్ : ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు భారత రాజ్యాంగం, పౌరుని హక్కులు, విధులు అనే అంశంపై వ్యాసరచన పోటీల ను నిర్వహించి, విజేతలకు బహుమతులను ఎంపీడీవో బత్తిని సింగయ్య అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, పట్టణ అభివృద్ధి కమిటి ఛైర్మన్ త్రిమూర్తులు పాల్గొన్నా రు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యం లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దుర్గాగాయత్రి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది రజని విద్య విలువను వివరించారు. బొమ్మనంపాడు జడ్పీహెచ్‌ఎస్ లో హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం జరిగింది. చక్రాయపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబెట్, క్విజ్ పోటీలను నిర్వహించి బహుతులను అందజేశారు.

పంగులూరు : ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో స్వ రూపారాణి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీ వో సంతోషం, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం ఓ ప విత్ర గ్రంథమని, ప్రజాస్వామ్యానికి, దేశ ప్ర జలకు రక్షణ కవచమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, టీడీపీ మం డల అధ్యక్షుడు రావూరి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల : భారత రాజ్యంగ ఆమోద దినోత్సవాన్ని గురువారం నియోజకవర్గంలో పలుచోట్ల ఘనం గా జరుపుకున్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ నాయకులు, కార్యకర్తలతో కలసి ముక్కోణపు పార్కు సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు మార్పు గ్రెగోరి, పైడి రాజేష్, బుజ్జిబాబు, సుధాకర్, చిట్టిబాబు, మేరిబాబు తదితరులు పలు సెంటర్లలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

యద్దనపూడి : మంగళవారం యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో షేక్ మహమ్మద్ అఖిబ్ జావెద్ ఉద్యోగులు, సిబ్బందితో రా జ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో ఏవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇడుపులపాడు ఉన్నత పాఠశాల, ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో రా జ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యా యులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

చినగంజాం : మండలంలో రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని మంగళవారం ఘ నంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది, వీఆర్వోలు, కడవకుదురు ఉన్నత పాఠశాలలో కొండేపి రామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదగంజాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలలో క్విజ్ పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేసినట్లు హెచ్‌ఎం ఎం.దేవదత్తం తెలిపారు. సెంటర్‌లోని అంబేడ్కర్ వి గ్రహానికి చినగంజాం గ్రామ సర్పంచ్ రాయ ని ఆత్మారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకు లు నివాళులర్పించారు.

పర్చూరు : తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ బ్రహ్మా య్య నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సుధారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేంకుమార్, వీఆర్వోలు, స్బింది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

ప్రగడ కోటయ్య ప్రజల మనిషి

వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రజాబంధు ప్రగడ కోటయ్య ప్రజల మనిషి. ఆయన నేటి తరం నేతలకు ఆదర్శప్రాయుడని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ప్రడగ కోటయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం కోటయ్య విగ్రహం వద్ద ప్రజాబంధు ప్రగడ కోటయ్య యూత్ వలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు వెంకటేష్, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ వరికూటి అమృతపాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగడ అందించిన సేవలను మననం చేసుకున్నారు. కోటయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా అభిమానులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల నివాళి

పలువురు కూటమి నాయకులు మంగళవారం ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాబంధు ప్రగడ కోటయ్య చీరాల నియోజవకర్గంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాడుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో పత్తిని అమ్మాలి

మార్టూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో పతి సాగు చేసిన రైతులు చిలకలూరిపేటలోని తిరుమల స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ రైతులకు చెప్పారు.మంగళవారం మండలంలోని ద్రోణాదుల గ్రామంలో పొగాకు కు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కిరణ్ కుమార్ రైతులతో మాట్లాడుతూ పొగాకు సాగు చేసిన రైతులు నష్టాలకు గురికాకుండా ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు, మొక్కజొన్న సాగుపై దృష్టిసారించాలన్నారు. ఆ వివరాలు కోసం రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు

వేటపాలెం (చీరాల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఏపీ ఆర్యవైశ్య మహా సభ ఒంగోలు వారి సహకారంతో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, లయన్ క్లబ్‌ల ప్రతినిధులు, ఆర్యవైశ్య ప్రతినిధులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మార్టూరు, నవంబరు 26 : ఆసుపత్రిలో వైద్య ఖర్చులు నిమిత్తం మార్టూరుకు చెందిన షేక్ దరియాబీకి ఎల్‌వోసీ లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.2.50లక్షలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. దాంతో దరియాబీ కుటుంబ సభ్యులకు మంగళవారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు అందచేశారు కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, ఉప్పలపాటి తిరుపతిరాజు పాల్గొన్నారు.

అద్దంకిలో చోరీ

- శ్రీరామ్ ఏజెన్సీ షాపు షట్టర్ పగులగొట్టి రూ.15.35లక్షల అపహరణ



శ్రీరామ్ ఎజెన్సీస్ షాపులో విచారిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్, సీఐ కృష్ణయ్య

అద్దంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాడి ఆవుల కొనుగోలుకు ఉంచిన నగదు అపహరణకు గురైంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని సంజీవనగర్ రోడ్డులో శ్రీరామ్ ఏజెన్సీ నిర్వహించే 16వ వార్డు కౌన్సిలర్ మేడం రమణ, రాంగోపాలరెడ్డి దంపతులకు ముండ్లమూరు మండలం చంద్రగిరి సమీపంలో శ్రీరామ్ డెయిరీతో పాట డెయిరీ ఫామ్ కూడా ఉంది. ఈ క్రమంలో నిత్యం పెద్ద మొత్తం లో నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. తమిళనాడులోని ఈరోడ్ వెళ్లి పాడి ఆవుల కొనుగోలు కోసం రూ.20లక్షల నగదును సోమవారం అద్దంకిలోని శ్రీరామ్ ఏజెన్సీలో ఉంచారు. అందులో సుమారు రూ.5లక్షలను ఇతర అవసరాలకు వాడారు. మిగిలిన నగదును క్యాష్ కౌంటర్‌లోనే ఉంచి తాళం వేసి వెళ్లారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు పైన ఉన్న లిఫ్ట్ షట్టర్ తాళం పగులగొట్టి షాపులోకి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్ తాళం కూడా పగులగొట్టారు. అందులో ఉన్న రూ.15.35 లక్షల నగదును అపహరించుకుపోయారు. మంగళవారం ఉదయం షాపు వద్దకు రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. షాపులో మొత్తం 16 సీసీ కెమెరాలు ఉండగా, సోమవారం నుండే పనిచేయడం లేదని రామ్‌గోపాలరెడ్డి పోలీసులకు తెలిపారు. గతంలోనూ ఇదే దుకాణంలో పట్టపగలు చోరీ జరిగింది. ఘటనా స్థలాన్ని చీరాల డీఎస్పీ మొయిన్, సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించారు. సాధారణంగా అంత మొత్తం నగదు షాపులో గతంలో ఎప్పుడూ ఉంచకపోవడం, సోమవారం నుంచే సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, షాపు పై నుంచి లిఫ్ట్‌కు ఉన్న షట్టర్ నుంచి సులువుగా షాపులోకి రావచ్చని తదితర అంశాలు అన్నీ క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తుల ప్రమేయంతోనే చోరీ జరిగి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు కూడా ఆ కోణంలోనే విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి స్థానిక వైసీపీ నాయకులతో కలిసి వచ్చి చోరీ జరిగిన షాపును పరిశీలించి మేడం రమణ, రామ్‌గోపాలరెడ్డితో మాట్లాడారు.